PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 43 | విజయవాడ, మంగళవారం 12 సెప్టెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Tuesday 12 September 2023 | Rs

అప్పు కట్టకుంటే

తీహార్ జైలుకే..

- 22లోగా క్రెడిట్ సూస్సెకు రుణం చెల్లించాల్సిందే
- మీరు వచ్చినా బాధపడేది లేదు
- స్పైస్‌జెట్ ఛైర్మన్‌కు సుప్రీం తీవ్ర హెచ్చరిక

లోపలి పేజీలో..

కోహ్లి, రాహుల్ శతకాలు

- పాకిస్తాన్‌పై 228 పరుగుల తేడాతో భారత్ రికార్డు గెలుపు

8

మనకున్నది ఒకటే భూమి అని, వ్యవస్థ మారాలే కాని వాతావరణం కాదని నినదిస్తూ ఆందోళన చేస్తున్న పర్యావరణ కార్యకర్తలు

ముప్పు దిశగానే

- వాతావరణ మార్పులపై ఐక్యరాజ్య సమితి నివేదిక

న్యూఢిల్లీ : ముప్పు దిశలోనే మానవాళి ప్రయాణం చేస్తోందని వాతావరణ మార్పులపై ఐక్యంరాజ్యసమితి గ్లోబల్ స్టాక్ టేక్ నివేదిక హెచ్చరించింది. 2015 ప్యారిస్ ఒప్పందంలో భాగంగా ఏర్పాటైన గ్లోబల్ స్టాక్ టేక్ తన మొదటి నివేదికను సోమవారం విడుదల చేసింది. వివిధ దేశాలు తీసుకున్న చర్యలను సమీక్షించి 2023వ సంవత్సరం నుండి ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నివేదిక ఇవ్వాలని ప్యారిస్ ఒప్పందంలో పేర్కొన్నారు. ఆ మేరకు యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ సచివాలయం తాజా నివేదికను విడుదల చేసింది.

ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదలను పారిశ్రామిక విప్లవానికి ముందు ఉన్న స్థాయిలకంటే రెండు డిగ్రీలకు తగ్గించాలని, వీలైతే 1.5డిగ్రీల సెంటిగ్రేడ్‌కు పరిమితం చేయడానికి ప్రయత్నించాలంటూ ప్యారిస్ ఒప్పందంలో పేర్కొన్న విషయం తెలిసిందే. దీనికోసం ఒప్పందంలో భాగస్వామ్యమైన వివిధ దేశాలు లక్ష్యాలను కూడా తీసుకున్నాయి. తీసుకున్న లక్ష్యాలను, ఆచరణలో అమలైన తీరును గ్లోబల్ స్టాక్ టేక్ నివేదిక తాజాగా విశ్లేషించింది. 'కొంత పురోగతి ఉన్నప్పటికీ అవసరమైన దాని కంటే చాలా వెనుకబడి ఉన్నాం, మానవాళి సురక్షిత మనుగడకు ఇది ఏ మాత్రం చాలదు' అని పెదవి విరిచింది. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు సంఘటితంగా, మరింత పట్టుదలతో భూగోళాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేయాల్సిఉందని పేర్కొంది. నివేదికను రూపొందించే ప్రక్రియ 2021లో ఐక్యరాజ్యసమితి ప్రారంభించింది. సాంకేతిక అంశాలను పరిశీలించేందుకు ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై ఈ నివేదికను రూపొందించింది. తాము జరిపిన చర్చల్లో ప్యారిస్ ఒప్పందం తరువాత ప్రపంచ దేశాల్లో పర్యావరణ స్పృహ పెరిగిందని, భూతాపాన్ని తగ్గించేందుకు అనేక చర్యలు దేశాలు చేపట్టాయని తెలిపింది.

నిరాశాజనకంగా 'ఆ' దేశాల తీరు

పర్యావరణ ముప్పును ఎదుర్కొనేందుకు పేద దేశాలకు అవసరమైన ఆర్థిక సాయం చేయడంలో అభివృద్ధి చెందిన దేశాల తీరు నిరాశాజనకంగా ఉంది నివేదికలో ఐక్యరాజ్యసమితి పేర్కొంది. 100 బిలియన్ డాలర్ల వాతావరణ నిధిని ఏర్పాటు చేయాలన్న లక్ష్యం ఇంకా నెరవేరకపోవడాన్ని ప్రస్తావించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో బడ్జెట్‌లు అధికభాగం రుణాలతోనే నిండిపోతున్నాయని, అందువల్ల వాతావరణ చర్యలకు ఆ దేశాలు నిధులు సమకూర్చలేకపోతున్నాయని పేర్కొంది. దీంతో వాతవారణ మార్పుల ప్రభావం ఆ దేశాలపై ఎక్కువగా పడుతోందని వివరించింది. ఇదే పరిస్థితి కొనసాగితే భూగోళంపై ఏ ఒక్కరూ సురక్షితంగా ఉండలేరన్న విషయాన్ని గమనించాలని పేర్కొంది.

చెదురు మదురు ఘటనలు మినహా

బంద్ ప్రశాంతం

- ప్రైవేటు విద్యాసంస్థలు మూసివేత
- కొన్నిచోట్ల షాపులను తెరిపించిన వైసిపి నేతలు
- తిరిగిన బస్సులు

ప్రజాశక్తి- యంత్రాంగం

చంద్రబాబునాయుడి అరెస్ట్‌కు నిరసనగా టిడిపి పిలుపుమేరకు సోమవారంం రాష్ట్ర బంద్ చెదురు ముదరు ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. ముందుజాగ్రత్త చర్యగా అదివారం అర్ధరాత్రి నుండే రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో టిడిపి, జనసేన నాయకులను పోలీసులు నిర్బంధించారు. రోడ్లమీదకు వచ్చిన వారిని సోమవారం తెల్లవారుజామునే ఎక్కడికక్కడ అరెస్ట్‌లు చేశారు. అరెస్ట్‌లను ప్రతిఘటించడంతో కొన్ని జిల్లాల్లో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రైవేటు విద్యాసంస్థలను రాష్ట్ర వ్యాప్తంగా ముందుగానే మూసివేశారు. కొన్ని జిల్లాల్లో బ్యాంకులు, ఎల్‌ఐసి, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, సినిమా థియేటర్లు మూతపడ్డాయి. బంద్ నిర్వాహకులు ఆర్‌టిసి డిపోల ముందు బైటాయించడంతో ఉదయం పది గంటల వరకూ బస్సులు తిరగలేదు. వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత ఆర్‌టిసి బస్సులు తిరిగినా ప్రయాణికులు పెద్దగా లేరు.ప్రభుత్వ కార్యాలయాల్లో హాజరు శాతం తగ్గింది. చిరువ్యాపారులు షాపులను మూసివేసినా కొన్ని చోట్ల వైసిపి నాయకులు, కార్యకర్తలు బలవంతంగా తెరిపించారు. చిత్తూరు, వైఎస్‌ఆర్, అన్నమయ్య, నెల్లూరు, గుంటూరు తదితర జిల్లాల్లో షాపులను వైసిపి నాయకులు, పోలీసులు దగ్గరుండి తెరిపించారని టిడిపి నాయకులు ఆరోపించారు దాదాపుగా అన్ని జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి.కర్నూలు, . బంద్‌కు జనసేన పార్టీ, సిపిఐ, లోక్‌సత్తా పార్టీ, జైభీమ్ పార్టీ, ఎంఆర్‌పిఎస్, పలు ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి.

విశాఖలో సిఎం జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేయకుండా అడ్డుకుంటున్న పోలీసులు

చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలో బంద్ సంపూర్ణంగా జరిగింది. గుడిపల్లిలో రోడ్డుపై వంట-వార్పు కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో టిడిపి నాయకులను, కార్యకర్తలను అష్టదిగ్బంధం చేసి బంద్‌ను విఫలం చేయడానికి పోలీస్ యంత్రాంగం ప్రయత్నించింది. అయినా బంద్ ప్రభావం కనిపించింది. పోలీసులతో జరిగిన వాగ్వివాదం, తోపులాటలో ప్రొద్దుటూరు సీనియర్ టిడిపి నాయకులు వరదరాజులరెడ్డి తీవ్ర అస్వస్తతకు గురయ్యారు. దీంతో, ఆయనను ఆస్పత్రికి తరలించారు. గుంటూరులో మూసిన షాపులను మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాలగిరి, వైసిపి నాయకులు తెరిపించడంతో వివాదానికి దారి తీసింది. పిడుగురాళ్ల, సత్తెనపల్లి తదితర ప్రాంతాల్లో టిడిపి కార్యకర్తలు సెల్ టవర్లు ఎక్కి నిరసన తెలిపారు. వినుకొండ, గురజాల తదితర ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఆర్‌టిసి బస్సులపై రాళ్లు రువ్వారు. అనంతపురం జిల్లాలో మాజీ మంత్రి పరిటాల సునీత వెంకటాపురంలో పోలీసుల గృహ నిర్బంధం నుంచి తప్పించుకుని రామగిరి వైపు వెళ్లారు. నసనకోట వద్ద ఆమెను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

సిపిఎం, సిపిఐ నేతల పరామర్శ

బంద్ సందర్భంగా అరెస్టయి పోలీస్ స్టేషన్లలో ఉన్న టిడిపి, జనసేన నాయకులను, కార్యకర్తలను విజయవాడలో సిపిఎం, మిగతా 2లో

ఉరితాళ్లుగా మెడకు చుట్టుకుంటాయి

- అధికార పార్టీల నిరంకుశ విధానాలపై సిపిఎం
- టిడిపి, జనసేన నాయకులకు వి శ్రీనివాసరావు పరామర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అధికారంలో ఉండే పార్టీలు నిరంకుశ విధానాలను అనుసరిస్తే అవే భవిష్యత్‌లో అవే ఉరితాళ్లుగా మెడకు చుట్టుకుంటాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఎప్పుడైనా ప్రతిపక్షంలోకి వస్తామన్న స్పృహతో ప్రజాస్వామ్యయుతంగా ఆ పార్టీలు వ్యవహరించాలని ఆయన అన్నారు. సోమవారం జరిగిన బంద్ నేపథ్యంలో విజయవాడలో అరెస్టయి గవర్నరుపేట పోలీసుస్టేషన్లో ఉన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో పాటు టిడిపి, జనసేన నాయకులను సిపిఎం బృందం పరామర్శించింది. అనంతరం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ పాలకులు ప్రజాస్వామ్యాన్ని హరించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపిన వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పౌర హక్కులు లేకుండా పోతున్నాయని, చిన్నచిన్న కార్యక్రమాలు, ఊరేగింపులు, ప్రదర్శనలతో సహా దేన్నీ అనుమతించడం లేదని అన్నారు. గృహ నిర్బంధాల పేరుతో వేధింపులకు దిగుతున్నారని చెప్పారు. గతంలోనూ టీచర్లు, స్కీము వర్కర్లు, కార్మికులనూ గృహ నిర్బంధానికి గురిచేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. మాజీ సిఎం చంద్రబాబును అరెస్టు చేసిన తీరు కూడా సరిగా లేదన్నారు. అవినీతిపై నిష్పక్షపాత విచారణ కంటే వేధించాలనే ఆలోచన పాలకుల్లో కనిపిస్తోందన్నారు. ఈ పద్ధతులను, అప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించిన ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బంద్‌లు ప్రదర్శనలు, నిరసనలకు అవకాశం లేదనడం సరికాదని అన్నారు. గతంలో వైఎస్‌ఆర్ కూడా ఆందోళనలు చేశారని, ఆయన కూడా కేసులు ఎదుర్కొన్నారనే విషయాన్ని పాలకులు గుర్తుంచుకోవాలన్నారు.

హైకోర్టు జడ్జి కారు పల్టీ

- జస్టిస్ వడ్డిబోయిన సుజాతకు గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయిన సుజాత ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి విజయవాడ వెళుతుండగా సూర్యాపేట - కోదాడ మధ్య గుంపుల వద్ద కారు అదుపుతప్పి పల్టీకొట్టింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కారులో చిక్కుక్కున్న వారిని బయటకు తీశారు. జస్టిస్ సుజాత తలకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్సులో ఆమెను సూర్యాపేటలోని న్యూ సిగ్మా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే స్థానిక మంత్రి జగదీష్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని నల్గొండ, సూర్యాపేట ఎస్‌పిలను ఆదేశించారు.

ముందస్తు అనుమతి అక్కర్లేదు

- సీనియర్ అధికారులను సిబిఐ నేరుగా విచారించొచ్చు
- 2014 నాటి తీర్పును పునరుద్ధాటించిన సుప్రీం

న్యూఢిల్లీ : సీనియర్ ప్రభుత్వ అధికారులపై వచ్చిన అవినీతి కేసులు దర్యాప్తు చేపట్టడానికి సిబిఐ ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరన్న నిబంధన చెల్లదని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. 2014లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునే రాజ్యాంగ ధర్మాసనం సోమవారం పునరుద్ఘాటిస్తూ, ఇది తీర్పు ఇచ్చినతేదీ నుంచే కాదు, సిబిఐకి మార్గ నిర్దేశం చేసే ఢిల్లీ ప్రత్యేక పోలీసు వ్యవస్థ (డిఎస్‌పిఇ) చట్టానికి సెక్షన్ 6ఎ ని జోడించిన తేదీ నాటి నుంచే అంటే 2003 సెప్టెంబరు 11 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించాలని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం పేర్కొంది. సెక్షన్6ఎ ఏం చెబుతోంది? ప్రభుత్వ ఉన్నతాధికారులపై అవినీతి వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరపాలంటే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని అంటోంది.

2014లో డాక్టర్ సుబ్రమణ్యం స్వామి కేసులో సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈ సెక్షన్-6ఎ రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసింది. దీంతో జాయింట్ సెక్రటరీ ఆపై ర్యాంక్ అధికారులను సిబిఐ ప్రాథమికంగా విచారణ జరపాలంటే సిబిఐకి ముందస్తు అనుమతి అవసరం లేదు. అయితే, కోర్టు తీర్పు ఇచ్చిన తేదీ నుంచే అమల్లోకి వస్తుందని, అంతకుముందు నమోదయిన అవినీతి కేసుల్లో ఇరుక్కున్న సీనియర్ బ్యూరోక్రాట్లకు సెక్షన్-6ఎ కింద రక్షణ ఉంటుందని కొందరు వాదించారు. ఈ వాదనలను నిర్ద్వందంగా తోసిపుచ్చిన సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం, ఆ సెక్షన్‌ను ఎప్పుడు చట్టంలో చేర్చారో ఆనాటి నుంచే దాని చెల్లుబాటు రద్దయిందని రద్దు చేస్తున్నట్లుగా వస్తుందని పునరుద్ఘాటించింది. సెక్షన్-6ఎ అనేది రాజ్యాంగంలోని సమానత్వ హక్కుకు హామీ ఇస్తున్న ఆర్టికల్14కి విరుద్ధమని రాజ్యాంగ ధర్మాసనం తేల్చి చెప్పింది.

అవినీతి దేశానికి శత్రువు

అవినీతి దేశానికి శత్రువు. అవినీతికి పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగి (పబ్లిక్ సర్వెంట్) మిగతా 7లో

బాబుకు జైలులో ప్రాణహాని

- ఎసిబి కోర్టులో సిద్ధార్థ లూథ్రా వాదనలు
- పూర్తి భద్రత కల్పించామన్న ఎఎజి సుధాకర్‌రెడ్డి
- తీర్పు నేటికి వాయిదా
- పిటి వారెంటు కోసం పిటీషన్ వేసిన సిఐడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ప్రాణహాని ఉందని అందువల్ల ఆయన్ను హౌస్ రిమాండ్‌కు పంపాలని న్యాయవాది సిద్ధార్ధ లూథ్రా సోమవారం ఎసిబి కోర్టులో వాదించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో ఆయన చంద్రబాబు తరపున వాదిస్తున్న విషయం తెలిసిందే.రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో కరుడుగట్టిన నేరస్తులు, ఆయుధాలు వినియోగించిన వ్యక్తులు శిక్ష అనుభవిస్తున్న విషయాన్ని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. నవలఖా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ఉదహరించారు. చంద్రబాబునాయుడికి బెయిల్ ఇవ్వాలని, లేదా హౌస్ రిమాండుకు అనుమతి ఇవ్వాలని చంద్రబాబు తరుపు న్యాయవాదులు కోర్టులో పిటీషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై రెండో రోజైన సోమవారం కూడా వాదనలు జరిగాయి.

చంద్రబాబు తరుపు సిద్ధార్థ లూథ్రా, ప్రాసిక్యూషన్ తరుపున ఎఎజి పొన్నవోలు సుధాకరరెడ్డి సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. తొలుత చంద్రబాబు వయస్సు, ఆరోగ్యం రీత్యా అతనికి హౌస్ రిమాండు ఇవ్వాలని కోరారు. రాజమహేంద్రవరంలో కరుడుగట్టిన నేరస్తులు ఉన్న నేపథ్యంలో చంద్రబాబుకు ప్రాణహాని జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్లే కేంద్రం కూడా ఎన్‌ఎస్‌జి భద్రత కల్పిస్తోందని పేర్కొన్నారు. దీనిపై ఎఎజి పొన్నవోలు సుధాకరరెడ్డి జోక్యం చేసుకుని చంద్రబాబుకు జైల్లో ప్రత్యేక వసతి కల్పించామని, లోపల బయట పూర్తి భద్రత ఉందని పేర్కొన్నారు. జైలు గోడలు 50 అడుగుల ఎత్తులో ఉంటాయని, భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆరోగ్య సమస్య ఉత్పన్నమైతే జైల్లోనే వైద్య చికిత్సకు ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తున్నారని కోర్టుకు తెలిపారు. ఎంత భద్రత ఉన్నా జైల్లో హత్యలు జరిగిన విషయాన్ని గుర్తించాలని చంద్రబాబు తరుపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అలాగే హౌస్ రిమాండుకు అనుమతి ఇవ్వాలని కోరగా సిఆర్‌పిసి చట్టంలో హౌస్ రిమాండు అనే విధానం లేదని పొన్నవోలు తెలిపారు. దీనిపై సిద్ధార్ధ లూథ్రా జోక్యం చేసుకుని గౌతమ్ నవలఖా కేసులో సుప్రీం కోర్టు ఇలాంటి తీర్పు ఇచ్చిందని ప్రస్తావించారు. సాయంత్రం వరకూ సుదీర్ఘంగా వాదనలు వన్న ఎసిబి కోర్టు న్యాయమూర్తి తీర్పును మంగళవారం సాయంత్రానికి వాయిదా వేశారు. అయితే ఉదయంలోపే తీర్పు ఇవ్వాలని సిద్ధార్ధ లూథ్రా కోరారు.

రింగురోడ్డు కేసులో కస్టడీ పిటీషన్

ఇదే సమయంలో చంద్రబాబునాయుడిపై సిఐడి న్యాయవాదులు మరో పిటీషన్ దాఖలు చేశారు. రింగురోడ్డు కేసులో విచారించేందుకు చంద్రబాబును పిటి(ప్రిజనర్స్ ట్రాన్సిట్) వారెంటు మీద తమ కస్టడీకి ఇవ్వాలని అందులో కోరారు. దీనిలో చంద్రబాబు మొదటి ముద్దాయిగా ఉన్నాడని, నారాయణ రెండో ముద్దాయని, నారా లోకేష్ ఆరో ముద్దాయని కోర్టుకు తెలిపారు. దీనిపైనా విచారణను వాయిదా వేశారు. దీంతో మంగళవారం న్యాయమూర్తి ఏమి తీర్పు ఇస్తారో అనే ఉత్కంఠ నెలకొంది.

సందిగ్ధంలో 'సాగర్' ఆయకట్టు రైతులు

- వర్షాధార పంటలకు ప్రోత్సాహం కరువు

పల్నాడు జిల్లా రాజుపాలెంలో వర్షాభావంతో ఎదుగుదలలేని పత్తి పొలం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో సేద్యం చేసేందుకు రైతులు అనేక ఇబ్బందులను చవిచూస్తున్నారు. సాగర్ జలాశయంలో నీటి నిల్వ పెరగకపోవడంతో వారిలో అయోమయం నెలకొంది. సాగర్ ఆయకట్టు పరిధిలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో కుడి కాలువ కింద 11 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో సుమారు రెండు లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఈ ఏడాది వరి సాగుకు అనుమతి లేదని ప్రభుత్వం ప్రకటించింది. ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని మంత్రి అంబటి రాంబాబు ఇటీవల గుంటూరులో రైతులకు సూచించారు. అయితే, ఆయకట్టు పరిధిలో వరి సాగు మాగాణి భూముల్లో వరి తప్ప, ఇతర పంటలు వేసే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. సాగర్ ఆయకట్టులో ఈ ఏడాది ఇప్పటి వరకు 12,300 ఎకరాల్లో మాత్రమే వరి సాగులో ఉంది. మొత్తం వరి విస్తీర్ణంలో ఆరు శాతం భూముల్లోనే నాట్లు వేశారు. ఇవి కూడా ఎక్కువగా వ్యవసాయ బోర్ల కిందే ఉన్నాయి. ఈ దృష్ట్యా ఖరీఫ్‌లో ఏ పంటలు వేయాలి? అక్టోబరు, నవంబరులో తుపాన్లు వస్తే ఈ పంటల పరిస్థితి ఏమిటి? అని రైతులు మదన పడుతున్నారు. మరోవైపు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని చెబుతున్న ప్రభుత్వం ఇంతవరకూ ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రకటించలేదు. సబ్సిడీపై విత్తనాలు, ఎరువుల సరఫరాపై ఎటువంటి ఆదేశాలూ రాలేదని అధికారులు చెబుతున్నారు. సహజంగా వరి తరువాత రెండో పంటగా జొన్న, మొక్కజొన్న వేస్తారు. ఇందుకు మరికొంత సమయం ఉందని, రబీలోనే వీటిని సాగు చేస్తామని గురజాల ప్రాంత రైతులు తెలిపారు. సాగర్ ఆయకట్టులో ఈ ఏడాది మిర్చి సాగు కూడా సంక్షోభంలో చిక్కుకుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 60 వేల ఎకరాల్లో మాత్రమే వేశారు. నవంబరు తరువాత మిర్చికి తప్పనిసరిగా రెండుమూడు తడులకు నీరు అవసరం. సాగర్ నుంచి నీరు రాకపోతే మిర్చి దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. సాగర్ నుంచి నీరు రాకపోవడం, వర్షాలు ఆశాజనకంగా లేకపోవడంతో సాగు తీవ్ర జాప్యం జరుగుతోంది. సెప్టెంబరు 11 దాటినా ఇంకా 40 శాతం కూడా సాగు కాలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 4.80 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకూ 1.80 లక్షల ఎకరాల్లోనే మాత్రమే సాగులో ఉంది. ప్రకాశం జిల్లాలో 85 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 35 వేల ఎకరాల్లోనే మాత్రమే వేశారు. పత్తి సాగు గడువు దాదాపు ముగిసిందని, ఈ పరిస్థితుల్లో అపరాలు తప్ప మిగతా ఏ పంటలూ వేయలేరని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్ మరో 20 రోజుల్లో ముగుస్తున్నా ఇంతవరకూ ఏ పంట సాగు కూడా 40 శాతం చేరలేదు. గత రెండు నెలలుగా జలాశయాల్లో నీటి నిల్వలు పెరగలేదు. శ్రీశైలం జలాశయం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 215.80 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 91.41 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉన్నాయి. సాగర్ జలాశయంలో గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 312.04 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 157.61 టిఎంసి నీరు నిల్వ ఉంది. పులిచింతలలో గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 26.98 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి.

14 నుంచి ఇఎపిసెట్ తుదిదశ కౌన్సిలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఇఎపిసెట్)-2023 ఎంపిసి అభ్యర్థుల తుది దశ అడ్మిషన్ల కౌన్సిలింగ్ ఈనెల 14 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి వై నజీర్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఈ నెల 14 నుంచి cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆగస్టు 23వ తేదీతో ముగిసిన తొలిదశ కౌన్సిలింగ్‌లో 94,580 సీట్లు భర్తీ అయ్యాయి. 26,276 సీట్లు భర్తీ కాలేదు.

తిరుపతిలో స్కిల్ యూనివర్శిటీ

- సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి అమరావతి బ్యూరో : తిరుపతిలో సాధ్యమైనంత త్వరలో స్కిల్ యూనివర్శిటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. స్కిల్‌డెవలప్‌మెంట్, శిక్షణ తదితర అంశాలపై సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుపతిలో స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, యువతకు వివిద రంగాల్లో శిక్షణ అందించడం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో వివిధ రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు కళాశాలలను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో గిరిజన ప్రాంతాలతో సహా 192 చోట్ల ఐటిఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, నాక్ కేంద్రాల అనుసంధానంతో స్కిల్ హబ్‌లు, 55 ప్రాంతాల్లో స్కిల్ స్పోక్స్ ఏర్పాటు ద్వారా ఇప్పటికే వివిధ రకాల నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జర్మనీ భాషలోనైపుణ్య శిక్షణపొందిన నర్సింగ్ విద్యార్థినులు త్వరలో జర్మనీ దేశానికి వెళ్లనున్నారని సిఎస్ తెలిపారు. రాష్ట్రంలోని సెర్ప్ ఆధ్వర్యంలో

నిర్వహిస్తున్న టిటిడిసి కేంద్రాల ద్వారా మరిన్ని శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని సెర్ప్ సిఇఓను సిఎస్ ఆదేశించారు. పరిశ్రమలు, చేనేత జౌళిశాఖ, సెర్ప్, ఉన్నత విద్యాశాఖ, ఐటి అండ్ ఎలక్ట్రానిక్స్, మత్స్య విభాగాలుకు మరిన్ని శిక్షణా కార్యక్రమాలకు కార్యాచరణ సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ కమిషనరు సురేష్‌కుమార్, నైపుణ్య శిక్షణాభివృద్ధి సంస్థ సిఇఓ వినోద్‌కుమార్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రాష్ట్రంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాల గురించి వివరించారు. ఓడరేవులు, విమానాశ్రయాల పనుల పురోగతిపై కూడా ఆయన సమీక్ష నిర్వహించారు. వాటికి సంబంధించిన భూసేకరణ, పెండింగ్ క్లియరెన్స్‌లపై కూడా సిఎస్ సమీక్షించారు.

పక్కా ఆధారాలతోనే చంద్రబాబుకు రిమాండ్

- హోం మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి - ఆరిలోవ, విశాఖ

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో పక్కా ఆధారాలతోనే చంద్రబాబుకు రిమాండు విధించారని, దీనిలో ఎటువంటి కక్షసాధింపు, దురుద్దేశం లేవని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అన్నారు. విశాఖలోని సాయిప్రియ హోటల్‌లో అధికారిక సదస్సుకు హాజరైన ఆమె ప్రత్యేకంగా విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చట్టం ఎవ్వరికీ అతీతం కాదని, అందరికీ సమానమేనని చెప్పారు. జైల్లో చంద్రబాబుకు ప్రాణహాని ఉందని చెప్పడం ఊహాజనితమన్నారు. అది సానుభూతి, రాజకీయ లబ్ధి కోసం చేసిన ఆరోపణలు మాత్రమేనని పేర్కొన్నారు. రాజమండ్రి జైలులో ఆయనకు అన్ని సదుపాయాలు, సెక్యూరిటీ ఉంటుందని తెలిపారు. టిడిపి పిలుపునిచ్చిన బంద్ ప్రభావం ఎక్కడా కనిపించలేదని చెప్పారు. దీనిని బట్టే చంద్రబాబుపై రాష్ట్ర ప్రజలకు ఉన్న సానుభూతి అర్ధమవుతుందని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఒకదాని వెనుక మరొకటి

- వరుస కేసులతో ఉక్కిరి బిక్కిరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రస్తుతం టిడిపి అధినేత చంద్రబాబు బెయిల్‌పై వచ్చినా మరో కేసులో వెంటనే అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ స్కాములో జైల్లో ఉన్న చంద్రబాబునాయుడికి బెయిల్ వస్తే వెంటనే మరొక కేసులో అదుపులోకి తీసుకునేందుకు సిఐడి పోలీసులు సిద్ధమయ్యారు. ఇన్నర్ రింగురోడ్డు వ్యవహారంలో చంద్రబాబును విచారించాల్సి ఉందని, కస్టడీకి ఇవ్వాలని ఇప్పటికే సిఐడి తరుపు న్యాయవాదులు పిటీషన్ దాఖలు చేశారు. అదే సమయంలో ఆదివారం మధ్యాహ్నం, అంగళ్లు, పుంగనూరు పోలీసులు విజయవాడ చేరుకున్నారు. చంద్రబాబు రిమాండును తిరస్కరిస్తే వెంటనే అదుపులోకి తీసుకునేందుకు వారూ సిద్ధమయ్యారు. దీంతో చంద్రబాబు వరుస రిమాండ్లను ఎదుర్కోవాల్సి ఉంది. మంత్రులు కూడా అదే కోణంలో ఇప్పట్లో వదిలేది లేదని ప్రకటనలు చేస్తున్నారు. ఏ కేసులో చంద్రబాబును అదుపులోకి తీసుకుంటారనే విషయం రేపు ఎసిబి కోర్టు తీర్పు అనంతరం తేలనుంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - మహానంది

అతివేగానికి ముగ్గురు మృతి చెందిన ఘటన నంద్యాల జిల్లా మహానందిలో చోటు చేసుకుంది. బోయలకుంట్ల మెట్ట వద్ద ఆటోను బొలెరో వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు...బిల్లాలాపురం గ్రామానికి నంద్యాల మండలం మిట్నాల గ్రామానికి చెందిన పరదేశిలక్ష్మి (40), పరదేశి బంగారు రాజు (27), గోస్పాడు మండలం యాలూరు గ్రామానికి చెందిన నేసుసుబ్బమ్మ (45), మార్తమ్మ, ఎనిమిదేళ్ల బాలుడు తిమ్మరాజు ఆటోలో వెళ్లారు. కుటుంబ పంచాయతీ నిమిత్తం అక్కడి నుంచి ఎంసీ ఫారం గ్రామంలోని మనోహర్ ఇంటికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో బోయల కుంట్ల మెట్ట వద్దకు చేరుకోగానే చేపల లోడుతో ప్రకాశం జిల్లాకు వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంతో ఆటోను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో మేష సుబ్బమ్మ, పరదేశి లక్ష్మి, పరదేశి బంగారు రాజు అక్కడికక్కడే మృతి చెందారు. మూర్తమ్మ, తిమ్మరాజు తీవ్రంగా గాయపడ్డారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపికి ఓటమి భయం : నాదెండ్ల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అధికార వైఎస్ఆర్‌సిపికి ఓటమి భయం పట్టుకుందని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి) ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలవలేమనే వైసిపి ప్రజలను భయపెట్టి ఓట్లు వేయించుకోవాలని చూస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ సోమవారం చేపట్టిన రాష్ట్ర బంద్‌లో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేశారని నాదెండ్ల తెలిపారు..

నియంతృత్వ పాలన కోసమే జమిలి

- నిజాంను కూల్చిన స్ఫూర్తితో బిజెపిని గద్దెదించేలా పోరాటాలు
- సంగారెడ్డిలో సాయుధ పోరాట వారోత్సవ సభలో బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒకేసారి ఎన్నికలంటే అధ్యక్షతరహా పాలన తీసుకురావడమేనని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. స్థానిక సంస్థలు, రాష్ట్రాల అధికారాలను హరించి ఒకే వ్యక్తి నియంతృత్వ పాలన సాగించడం కోసమే మోడీ జమిలీ జపం చేస్తున్నారని విమర్శించారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సిపిఎం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పిఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సభకు రాఘవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని వీరనారి ఐలమ్మ విగ్రహం నుంచి పిఎస్‌ఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో జమిలీ ఎన్నికలైనా, సాధారణ ఎన్నికకైనా సిపిఎం సిద్ధంగా ఉన్నదన్నారు. దేశంలో ప్రతిపక్షాలు ఐక్యమవుతుండటంతో మోడీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓడిపోతామన్న నిజాన్ని గమనించే జమిలీ ఎన్నికలకు పోయేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దేశం సాధించిన గొప్పతనమంతా తమ వల్లే జరిగినట్టుగా మోడీ తనకు తానే ప్రచారం చేసుకుంటున్నారన్నారు. జాతీయోద్యమంలో పాల్గొన్న చరిత్ర బిజెపికి కాని, దాని మాతృసంస్థలైన జనసంఘ్, ఆర్‌ఎస్ఎస్‌కూ లేవన్నారు. ఇండియా, భారత్ రెండు పదాలు కూడా రాజ్యాంగంలో ఉన్నాయని, ఇప్పుడు భారత్ పేరు మార్చాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దేశంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను మరుగున పర్చేందుకే దేశం పేరు మార్పు, సనాతన ధర్మం చుట్టూ చర్చ జరిగేలా చేస్తున్నారన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడడమంటే కుల వ్యవస్థను కొనసాగించడమేనని స్పష్టంచేశారు. ఎన్నికల్లో ఓట్ల కోసం హిందూ మతాన్ని రెచ్చగొట్టడం బిజెపికి అలవాటుగా మారిందన్నారు. జీ-20 దేశాల సమావేశాలు ఆయా దేశాల్లో రొటీన్‌గా జరిగే ప్రక్రియ తప్ప అందులో ప్రత్యేకత ఏమీ లేదన్నారు. దేశ ప్రజలకు సంబంధించిన అధిక ధరలు, నిరుద్యోగం, రైతులకు మద్దతు ధర, రాజ్యాంగ పరిరక్షణ, మహిళా రిజర్వేషన్లు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలపై పోరాటాలు సాగించాలని ప్రజలను కోరారు. వెట్టి చాకిరి విముక్తి కోసం ఆనాడు నిజాం నవాబును తరిమికొట్టిన స్ఫూర్తితో దేశంలో నియంతృత్వ పాలన సాగిస్తున్న మోడీని గద్దె దించేందుకు పోరాడాలని కోరారు.

చంద్రబాబు అక్రమాలన్నింటిపై విచారణ చేస్తాం : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబునాయుడు అక్రమాలన్నింటిపైనా విచారణ జరిపిస్తామని వైసిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అరెస్ట్ జరిగిందనేది అవాస్తవమని తమ పార్టీ ప్రతిపక్షంలో వున్నపుడే అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని కోరామని ఆయన గుర్తు చేశారు. సోమవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నిధులు చంద్రబాబు ఖాతాలోకే చేరాయని తేలిందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు జగన్‌మోహన్‌రెడ్డిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డా తాము అలా చేయడం లేదన్నారు. కోర్టు పరిధిలో వున్న కేసుపై సీనియర్ బ్యూరోక్రాట్ పివి రమేష్ మాట్లాడటం తగదన్నారు. ఈ కేసులో అన్ని ఆధారాలతో సిఐడి ముందుకు వెళ్తోందని తెలిపారు. అమరావతి భూముల కుంభకోణం, ఇన్నర్ రింగ్ రోడ్డులో అక్రమాలు, అమరావతి నిర్మాణం, టిడ్కో ఇళ్ళు, ఫైబర్‌నెట్ కేసులన్నింటినీ నిగ్గుతేలుస్తామన్నారు.

చంద్రబాబు రాజకీయాలకు కాలం చెల్లింది : మంత్రులు బొత్స, అంబటి

రాష్ట్రంలో చంద్రబాబునాయుడి రాజకీయాలకు కాలం చెల్లిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు.. సోమవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు బహిరంగంగా అవినీతి కేసులో అరెస్ట్ అయినా చేసిన తప్పును ఒప్పుకుని పొరపాటయిందని చెప్పి చెంపలకు వేసుకోవాల్సింది పోయి జనాన్ని రెచ్చగొట్టడం సరైంది కాదన్నారు.

ప్రభుత్వం అరెస్ట్ చేసినపుడు ఏమనకుండా కోర్టు రిమాండ్‌కు పంపితే బంద్‌కు పిలుపునివ్వడం ఏమిటని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబునాయుడుకు చిత్తశుద్ధి వుంటే ధైర్యంగా విచారణను ఎదుర్కోవాలని సూచించారు. ఇన్నాళ్లు అన్ని వ్యవస్థలను మేనేజ్ చేస్తూ అక్రమాలనుండి బయటపడుతున్న చంద్రబాబునాయుడుకు కాలం చెల్లిందన్నారు.

చంద్రబాబునాయుడు 1978 నుండి చట్టానికి దొరకకుండా అక్రమాలు చేస్తూ గడిపారని మొదటి సారి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయంలో చట్టానికి చిక్కి విలవిలాడుతున్నారని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. దశాబ్దాలుగా అవినీతికి పాల్పడుతూ చంద్రస్వామిగా అవతారమెత్తిన చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్ కేసులో అడ్డగోలుగా దొరికి పోయారని అన్నారు.

బంద్‌లో చంద్రబాబు డెయిరీ మూయలేదు: పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపి బంద్‌కు పిలుపు ఇస్తే చంద్రబాబు సొంత డెయిరీ హెరిటేజ్ కూడా మూతపడలేదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. చంద్రబాబు సొంత గ్రామంలోనూ షాపులు తెరిచే ఉన్నాయని ఆయన తిరుపతిలో విలేకరులతో అన్నారు. టిడిపి నాయకులుకానీ, ఆయన తరపు లాయర్లుకానీ గవర్నర్ అనుమతి లేదు వంటి టెక్నికల్ అంశాలను లేవనెత్తుతున్నారు తప్ప చంద్రబాబు ఏ తప్పు చేయలేదని అనడం లేదన్నారు. మూడు రాజధానుల బిల్లు, ఇంగ్లీష్ మీడియం, ఇళ్లపట్టాలపై స్టే తెచ్చారని, ప్రభుత్వ కార్యక్రమాలకు కోర్టులో స్టే తెస్తే అది సక్రమం, చంద్రబాబును అరెస్టు చేస్తే అది అక్రమమా? అని ఆయన ప్రశ్నించారు. ఒక్కరోజు చంద్రబాబు జైల్లో ఉంటే విలవిలలాడుతున్నారన్నారు. కేబినెట్ సబ్‌కమిటీలో అనేక అంశాల్లో అవినీతిపై రిపోర్టు ఇచ్చామని, త్వరలోనే అవన్నీ బయటకు వస్తాయని చెప్పారు. పవన్‌కల్యాణ్ ఆరోపణలపైనా విచారణ చేయాలని కోరుతామని, అబద్దాలని రుజువైతే పరువు నష్టం దావా వేస్తామని అన్నారు.

ఆ రిపోర్టు ఓ కట్టుకథ

- చంద్రబాబు అరెస్టు అక్రమం
- ఆర్థిక నేరస్థుడిగా చిత్రీకరించే యత్నం
- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబునాయుడ్ని తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ సిఐడి రూపొందించిన రిపోర్టు పూర్తిగా కట్టుకథ అని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఆరోపించారు. ఆధారాలు లేకుండా టిడిపి అధినేతను అరెస్టు చేయడం అక్రమమని పేర్కొన్నారు. 16 నెలలు జైలు జీవితం గడిపిన ముఖ్యమంత్రి జగన్..చంద్రబాబును కూడా ఒక్కరోజైనా జైలులో ఉంచాలనే ఆతృతతోనే ఇలాంటి అక్రమానికి ఒడిగట్టారని, అంతే తప్ప ఈ కేసులో పస లేదని యనమల అన్నారు. స్కిల్ డెవలప్‌మెర్ కార్పొరేషన్ యాక్టివిటీకి, ప్రభుత్వ యాక్టివిటీకి సంబంధం లేదన్నారు. జగన్‌కు సంబంధించిన బినామీ లావాదేవీల వివరాలు తమ వద్ద ఉన్నాయని, సందర్భం వచ్చినప్పుడు బయటపెడతామని చెప్పారు. పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేసి, తద్వారా ప్రతిపక్షాలు లేకుండా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. జగన్ సిబిఐ కేసుల్లో రేపటి నుంచి విచారణ ప్రారంభమవుతోందన్నారు. ట్రయల్స్ ప్రారంభమయితే జగన్ జైలుకెళ్లడం ఖాయమన్నారు.

టిడిపి అవినీతిని బయటపెట్టామని వైసిపి నాయకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని శాసనమండలి మాజీచైర్మన్, టిడిపి నాయకులు ఎంఏ షరీఫ్ వ్యాఖ్యానించారు. నాలుగున్నరేళ్లుగా ఒక్క ఆధారం దొరకలేదని, ఇప్పుడు అవినీతి మరకలు పులిమే కుట్రకు తెరతీశారని విమర్శించారు. చంద్రబాబును జైలుకు పంపాలనేది ముఖ్యమంత్రి జగన్ నాలుగున్నరేళ్ల కల అని మాజీమంత్రి, టిడిపి నేత కన్నా లక్ష్మీ నారాయణ ఎద్దేవా చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో నారా లోకేష్‌ను కూడా ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు పేర్కొన్నారు. టిడిపి నేతలు పంచుమర్తి అనురాధ, చింతకాయల విజయ్, బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు కూడా వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

గవర్నర్‌కు వినతిపత్రం అందిస్తున్న అచ్చెన్నాయుడు, గంటా శ్రీనివాసరావు తదితరులు

జైలులో చంద్రబాబుకు ప్రాణహాని : అచ్చెన్న

- గవర్నర్‌ను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖ)

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు అరెస్టుపై ఆ పార్టీ నేతలు సోమవారం విశాఖ పోర్టు గెస్ట్‌హౌస్‌లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. ఆదివారం ఉదయమే గవర్నర్‌ను కలిసేందుకు వారు ప్రయత్నించగా సోమవారం ఉదయం గవర్నర్ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. గవర్నర్‌ను కలిసి బయటకు వచ్చిన తర్వాత మీడియాతో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. జైలులో చంద్రబాబుకు ప్రాణహాని ఉందని తాము గవర్నర్‌కు తెలిపామని చెప్పారు. చంద్రబాబు అరెస్టుపై తనకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నానని గవర్నర్ వివరించారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో టిడిపికి పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. నాలుగేళ్ల పాలనలో ఈ అవినీతి కనిపించలేదా? అని ప్రశ్నించారు. ఐ ప్యాక్ టీమ్ జరిపిన సర్వేలో అధికార పార్టీ పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిసి పోటీచేస్తే వైసిపి చిరునామా గల్లంతేనని తేలడంతో కక్ష సాధింపు చర్యలకు దిగిందని విమర్శించారు. టిడిపికి సంక్షోభాలు కొత్తకాదని, దీన్ని అవకాశంగా మలుచుకుని ముందుకెళ్తామని స్పష్టం చేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, నాయకులు రాజబాబు తదితరులు ఉన్నారు.

రాజమండ్రి సెంట్రల్ జైల్ వద్ద హై అలర్ట్

- ప్రధాన వీధుల్లో పోలీసుల పహారా

సెంట్రల్ జైలు వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబుకు రిమాండ్ విధించిన నేపథ్యంలో రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైల్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు జైలు ప్రధాన వీధిలో రాకపోకలపై ఆంక్షలు పెట్టారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేసి అనుమానితుల రాకపోకలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. నగరంలో బంద్ పాక్షికంగా జరిగింది. రాజమహేంద్రవరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మధ్యాహ్నం వరకూ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. బంద్ పేరుతో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించిన కార్యకర్తలను పోలీసులు చెల్లాచెదురు చేశారు. ప్రధాన వీధుల్లో పోలీసుల పహారా కొనసాగించారు. రాజమహేంద్రవరంలో నారా లోకేష్ బస చేసిన విడిది ఇంటి వద్ద పోలీసులు భారీగా మొహరించారు. ఆంక్షలు విధించి బారికేడ్లతో ట్రాఫిక్ మళ్లించారు.

తొలిరోజు జైలు జీవితం గడిచిన చంద్రబాబు

చంద్రబాబు జైలు జీవితం తొలి రోజైన సోమవారం ఇంటి నుంచే అల్పాహారం, ఫ్రూట్ సలాడ్ అందజేశారు. చంద్రబాబుకు ఇంటి భోజనానికి న్యాయం స్థానం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో సోమవారం ఉదయం ఫ్రూట్ సలాడ్‌తో పాటు వేడి నీళ్లు, బ్లాక్ కాఫీని కుటుంబ సభ్యులు పంపారు. మధ్యాహ్నం 100 గ్రాముల బ్రౌన్ రైస్, బెండకాయ వేపుడు, పన్నీర్ కూర, పెరుగు పంపించారు. మధ్యాహ్నం 3 గంటలకు టీ తాగేందుకు వేడి నీళ్లు అందించారు. సోమవారం 4 గంటలకు నిద్రలేచిన చంద్రబాబు కొద్ది సేపు యోగా చేశారు. అనంతరం ఆయన ఇంటి నుంచి వ్యక్తిగత సిబ్బంది అల్పాహారంతో పాటు మెడిసిన్స్ తీసుకొచ్చారు. చంద్రబాబు వయస్సు, ఆరోగ్యం రీత్యా ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ప్రత్యేక గదిని అందుబాటులో ఉంచినట్టు సమాచారం. ఇదే జైలులో కరుడు గట్టిన నేరస్తులు ఉండటంతో చంద్రబాబు రక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది.

నేడు కుటుంబ సభ్యుల ములాఖత్‌కు అనుమతి

చంబ్రాబును కలిసేందుకు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, బ్రాహ్మణి, లోకేష్‌లకు మంగళవారం ములాఖత్‌కు అవకాశం కల్పించారు. తొలిరోజు ములాఖత్‌కు కోరినప్పటికీ అధికారులు అనుమతించలేదు. ఇప్పటికే చంద్రబాబు కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరానికి చేరుకున్నారు.

16న రాజమహేంద్రవరంలో కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 16 న రాజమహేంద్రవరంలో కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 16న ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరంలో గోకవరం బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ భవనం హాలులో సదస్సు జరుగుతుందని, రాష్ట్రంలో అన్ని జిల్లాల నుండి కొబ్బరి రైతులు ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కనీస పెట్టుబడి ఖర్చులూ రాక కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ సందర్భంగా వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరా కొబ్బరి తోటకు రూ.60 వేలకు పైగా పెట్టుబడి అవుతోందని, చెట్టు నుండి కొబ్బరికాయ కోసి గుట్టగా పోయడానికి కాయకు రూ.3 ఖర్చవుతోందని తెలిపారు. కానీ వ్యాపారులు ఎండు కొబ్బరి కాయకు రూ.7కి మించి ధర ఇవ్వడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులకు అవకాశం కల్పించడం వల్ల దేశంలో కొబ్బరి రైతులు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపచేసి నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొబ్బరి కాయలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు కనీస ధర ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొబ్బరి రైతులు సమస్యలు పరిష్కారం కోసం సంఘటితం కావాలని డిమాండు చేశారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ అయోధ్యరామ్

దొడ్డి దారిన ప్రయివేటీకరణ దుర్మార్గం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ అయోధ్యరామ్

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖ)

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు యాజమాన్యం దొడ్డిదారిన సహకరించడం దుర్మార్గమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె అయోధ్యరామ్ పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 942వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ డబ్ల్యుఆర్ఎం 1, 2 విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి అయోధ్యరామ్ మాట్లాడుతూ, ప్లాంట్‌లోని యుటిలిటీస్ విభాగం విస్తరణలో భాగంగా ఆక్సిజన్ ప్లాంట్ ప్రయివేటు భాగస్వామ్యంతో నిర్మించామని, దీనిని కోర్టుల అనుమతితో తిరిగి పొందినట్లు తెలిపారు. కానీ నేడు ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనలతో వీటిని నడపలేరని ప్రయివేటు వారికి అప్పగించడాన్ని ప్రయత్నించడాన్ని సహించబోమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ముందుకు తీసుకెళ్లడంలో స్టీల్ యాజమాన్యం సహకరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ శిబిరంలో సిఐటియు జిల్లా నాయకులు ఎన్ రామారావు, డబ్ల్యుఆర్ఎం-1, 2 ప్రతినిధులు వి మురళి, నాగబాబు, బి సత్యనారాయణ, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కేంద్రం కనుసన్నల్లోనే చంద్రబాబు అరెస్టు

- హర్షకుమార్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు ప్రక్రియ అంతా కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే జరిగిందని మాజీ ఎంపి జివి.హర్షకుమార్ విమర్శించారు. రాజమండ్రి సెంట్రల్ జైలు వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ ఎన్‌డిఎకు వ్యతిరేకంగా కూటమి కట్టి పోరాటం చేస్తుంటే, తమ మద్దతు ఎన్‌డిఎకే అన్నట్లుగా టిడిపి గుడ్డిగా వ్యవహరిస్తోందన్నారు. అదే ఎన్‌డిఎ సర్కారు కనుసన్నల్లోనే నేడు చంద్రబాబు అరెస్టు జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహకారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా అరెస్టు చేసే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా టిడిపి కళు తెరుచుకోవాలని హితవు పలికారు. వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు అవినాష్‌రెడ్డి అరెస్టు వ్యవహారం, నేడు చంద్రబాబును అరెస్టు చేసిన తీరును చూస్తే ఇది స్పష్టమవుతోందని చెప్పారు. వైసిపికి కేంద్రంలో ఎన్‌డిఎ సర్కారు అండదండలు ఉన్నాయని, చంద్రబాబు అరెస్టు ద్వారా ఇది నిరూపణ అయ్యిందన్నారు. 74 ఏళ్ల వయస్సున ఒక మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేసిన తీరు తనను ఎంతగానో బాధించిందని తెలిపారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పోలీసులతో ప్రతిపక్షాలను అణచివేయడం సర్వసాధారణమేనని, అయితే వైసిపి ప్రభుత్వం అందుకు పదింతలు అన్నట్లుగా పోలీసులను వినియోగిస్తుందని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వాహణ కార్పొరేషన్ ద్వారా జరిగిందని, ఆర్థిక లావాదేవీలన్నీ అధికారుల చేతుల్లోనే ఉంటాయన్నారు. అయితే, చెక్కుల మీద చంద్రబాబే సంతకాలు చేసినట్లుగా వైసిపి ప్రభుత్వం చెబుతోందని, ఇందుకు ఆధారాలను ఇప్పటికీ బయటపెట్టలేదని, చంద్రబాబుపై పెట్టిన కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపేనని అన్నారు.

గవర్నర్ పేరుతోనే షేర్లు

ఇపిడిసిఎల్ నిర్ణయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఏ ప్రభుత్వ శాఖలోనైనా గవర్నర్ పేరును 'గవర్నర్ తరఫున' అని వ్యవహరిస్తారు. సంస్థల షేర్ హోల్డర్ల అంశంలో, ప్రభుత్వం ఇచ్చే ఉత్తర్వుల్లో, సంస్థలు తీసుకునే రుణాల ఒప్పందంలో కూడా 'గవర్నర్ తరఫున' అనే ప్రస్తావిస్తారు. అయితే తూర్పు విద్యుత్ డిస్కామ్ మాత్రం కొత్త విధానాన్ని అవలంభిస్తోంది. సంస్థ షేర్ హోల్డర్ల జాబితాలో నేరుగా గవర్నర్ పేరునే పొందుపరచడం గమనార్హం. ఇన్నాళ్లు గవర్నర్ తరఫున ప్రతినిధిగా రాష్ట్ర ప్రభుత్వం అన్న పదాలు ఉండగా, దీనిని హిస్ ఎక్సలెన్సీ గవర్నర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా మార్పు చేయాలని నిర్ణయించారు. ఇదే సమయంలో ఇన్నాళ్లు నేరుగా అధికారుల పేరుమీద ఉన్న సభ్యులను కూడా ఇకపై ఆయా అధికారుల వారి పదవిపై మార్చాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. నాగులపల్లి శ్రీకాంత్, సంతోషరావు, కుమారరెడ్డి, హర్నాధరావు, వెంకటేశ్వరరావు, చంద్రం, రాజాబాపయ్య, రమేష్‌ప్రసాద్ వంటి అధికారుల పేరుపైనే షేర్లు ఉండగా, ఇకపై పేర్లను తీసివేసి వారి పదవిని షేర్ హోల్డర్లుగా మార్చాలని నిర్ణయించారు.

అధికారుల విషయంలో ఈ మార్పులు బాగానే ఉన్నప్పటికీ, గవర్నర్‌ను నేరుగా షేర్ షేర్ హోల్డర్‌గా ఉంచడంపైనే ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. దీనివల్ల సంస్థ తీసుకునే రుణాల బాధ్యత కూడా గవర్నర్ వహించాల్సి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఏపి రాష్ట్రాభివృద్ధి సంస్థ తీసుకున్న 25 వేల కోట్ల రుణాల సమయంలో ఒప్పందంపై నేరుగా గవర్నర్ సంతకం ఉండేలా చూడడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో తరువాత ఆ పేరును తొలగించి గవర్నర్ తరపున అని మార్చడం జరిగిన విషయం తెలిసిందే.

గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో టిడిపి, జనసేన నాయకులను పరామర్శించి వస్తున్న వామపక్షాల నాయకులు

బంద్ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ నేతలు పరామర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ లతో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.వి.కృష్ణ, డి.కాశీనాథ్, సిపిఐ నాయకులు వనజ, కోటేశ్వరరావు, శంకర్, రావుల వెంకయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

17 మంది మృతి చెందారు : టిడిపి

చంద్రబాబు అరెస్టు తట్టుకోలేక రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది టిడిపి కార్యకర్తలు గుండెపోటుతో మృతి చెందారని టిడిపి ఒక ప్రకటనలో పేర్కొంది. టిడిపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్యనేతలు సమావేశమయ్యారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కార్యకర్తలు సంయమనం పాటించాలని, భావోద్వేగాలకు గురికావొద్దని కోరారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో మరో సమావేశం జరిగింది.

కుప్పంలో టిడిపి, జనసేన శ్రేణుల నిరసన

హెల్త్ ఆఫీసర్స్‌కు వేతనాలు పెంచాలి

- ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా రాష్ట్రంలోని 'హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాల్లో పని చేస్తున్న తమకు వేతనాలు పెంచాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పోస్టుకార్డుల ద్వారా విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఆరోగ్య మంత్రి, చీఫ్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్ గారికి వేల వేలుగా పోస్టుకార్డులు పంపినట్టు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ప్రియాంక, ఉపాధ్యక్షులు ప్రేమ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల నుండి వైఎస్ఆర్ గ్రామీణ హెల్త్ క్లీనిక్స్ ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు వేతనాలు ఒక్కసారి కూడా పెంచలేదని వారు పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా ఎంఎల్‌హెచ్‌పిలకు కూడా వేతనాలు పెంచాల్సివుందని తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే పలుమార్లు మిషన్ డైరెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోలేదని, అందుకే పోస్టుకార్డుల ద్వారా ముఖ్యమంత్రిని కోరుతున్నట్లు తెలిపారు.

లక్ష్యానికి దూరంగా 'ఫిష్ ఆంధ్రా'

- కాకినాడ జిల్లాలో 240 మినీ ఫిష్ అవుట్‌లెట్లకు ప్రతిపాదనలు
- ఇప్పటి వరకూ 48 మాత్రమే ఏర్పాటు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

స్థానికంగా మత్స్య సంపద వినియోగాన్ని పెంచేందుకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు తీసుకొచ్చిన 'ఫిష్ ఆంధ్రా' పథకం జిల్లాలో లక్ష్యానికి దూరమవుతోంది. పథకం ప్రారంభమై రెండేళ్లయినా మినీ ఫిష్ అవుట్ లెట్లను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేకపోయారు. జిల్లాలో 76 కిలోమీటర్ల మేర సముద్ర తీరప్రాంతముంది. ఏటా 2.50 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. సుమారు 50 వేల కుటుంబాలు సముద్రపు వేట, చేపల విక్రయాలపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఏటా జిల్లాలో 28 వేల మెట్రిక్ టన్నుల సముద్రపు రొయ్యలు, చెరువుల్లో 1.20 లక్షల టన్నులు, ఉప్పు నీటి చెరువుల్లో 92 వేల మెట్రిక్ టన్నుల సీఫుడ్ ఉత్పత్తి జరుగుతోంది. 87 వేల మెట్రిక్ టన్నుల సముద్రపు చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. మంచినీటి చెరువుల్లో చేపలు, రొయ్యల ఉత్పత్తిలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలోనూ, సముద్రంలో చేపల ఉత్పత్తిలో రెండో స్థానంలోనూ ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో రెండు ఆక్వా హబ్‌లు, 240 మినీ ఫిష్ ఔట్ లెట్లు ఏర్పాటు చేయాలని జిల్లా మత్స్య శాఖాధికారులు ప్రతిపాదించారు. తాజా స్వచ్ఛమైన చేపలను ప్రజలకు అందించడంతోపాటు ఆక్వా రైతులకు మార్కెటింగ్ అవకాశం కల్పించాలనే ప్రధాన లక్ష్యంతో వీటికి 2021 డిసెంబర్‌లో శ్రీకారం చుట్టారు. గతేడాది జూన్ నాటికి వీటిని పూర్తి స్థాయిలో ప్రారంభించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటి వరకు 164 ప్రాంతాలను గుర్తించారు. 86 యూనిట్లు ఏర్పాటుకు బ్యాంకులు గ్రౌండింగ్ చేశాయి. వీటిలో తాళ్లరేవు, పిఠాపురం, జి.మామిడాడ, యు.కొత్తపల్లి, కరప తదితర ప్రాంతాల్లో మాత్రమే 48 మినీ ఫిష్ ఔట్ లెట్లు ఏర్పాటయ్యాయి.

పిఠాపురంలో ప్రారంభానికి నోచుకోని మినీ అవుట్‌లెట్

బ్యాంకు రుణంతోపాటు రాయితీలు

జనరల్ బిసిలకు 40 శాతం, ఎస్‌సి, ఎస్‌టి, మహిళలకు 60 శాతం రుణంగా అందజేస్తారు. లబ్ధిదారులు 15 శాతం తన వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తం బ్యాంకు రుణం, రాయితీగా అందిస్తారు. ఇందులో కేంద్రం 60, రాష్ట్రం 40 శాతం ఇవ్వనున్నాయి. మినీ ఫిష్ అవుట్ లెట్ ఏర్పాటుకు యూనిట్‌కు రూ.1.70 లక్షల నుంచి రూ.3.02 లక్షల వరకు, రెడీ టు ఈట్, రెడీ టు కుక్కింగ్ వంటి మత్స్య సంబంధిత ఆహార పదార్థాలను విక్రయించడం కోసం వాల్యూయాడెడ్ యూనిట్లు ఏర్పాటుకు రూ.10 లక్షలు, రూ.20 లక్షలు, రూ.50 లక్షల వరకూ రుణం మంజూరు చేస్తారు. వీటి ఏర్పాటుకు అధికారులే బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించాలి. జిల్లాకు రూ.10 లక్షల యూనిట్లు ఐదు, రూ.20 లక్షల యూనిట్లు రెండు, రూ.50 లక్షల యూనిట్ ఒకటి మంజూరైనా నేటికీ ఒక్కటి కూడా ఏర్పాటు కాలేదు. లక్ష్యానికి అనుగుణంగా రాయితీలు, రుణాలు సక్రమంగా ఇవ్వకపోవడమే ఇందుకు కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరికరాలు పూర్తిస్థాయిలో సరఫరా కాకపోవడంతో అవుట్ లెట్ల ఏర్పాటు చాలావరకూ ప్రారంభ దశలోనే ఆగిపోయింది. ప్రారంభించిన షాపులకు కూడా చేపలు సరఫరా చేయడం లేదు. మరోవైపు అధికారులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించడంలో లోపాలు కనిపిస్తున్నాయి. దీంతో, వీటి ఏర్పాటుకు ముందుకు రావడం లేదు. లక్ష్యానికి అనుగుణంగా యూనిట్లు ఏర్పాటయ్యేలా చూడాల్సిన అవసరం ఉందని నిరుద్యోగులు అంటున్నారు.

యూనివర్సిటీల్లో కోర్సుల విలీనం ఆపాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సదస్సు డిమాండ్
- కన్వీనింగ్ కమిటీ కన్వీనర్‌గా మాధవ్

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

యూనివర్సిటీల్లో కోర్సుల విలీనాన్ని ఆపాలని, అధ్యాపక పోస్టుల భర్తీలో రేషనలైజేషన్ విధానాన్ని రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, అశోక్ డిమాండ్ చేశారు. మూడు రోజుల పాటు ఎస్‌వి యూనివర్సిటీలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సదస్సులో పలు తీర్మానాలను ఆమోదించారు.

యూనివర్సిటీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని, పాత పద్ధతిలోనే పిజి, పిహెచ్‌డి అడ్మిషన్ ప్రక్రియ జరగాలని, పిహెచ్‌డి విద్యార్థులకు నెలకు రూ.25వేల ఫెలోషిప్ ఇవ్వాలని, అధ్యాపక పోస్టుల భర్తీ చేయాలని, రాజకీయ జోక్యం తగ్గించి స్వయం ప్రతిపత్తిని కాపాడాలని, సెంట్రల్ విశ్వ విద్యాలయానికి సొంత భవనాలు నిర్మించాలని, వైఎస్ఆర్ ఫైన్ఆర్ట్స్, ఆర్కిటెక్చర్‌కు సొంత భవనాలు నిర్మించాలని తీర్మానించారు. యూనివర్సిటీల విద్యార్థులను ఏకం చేయడానికి కన్వీనింగ్ కమిటీని నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర యూనివర్సిటీల కన్వీనర్‌గా మాధవ్ (శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం), కో-కన్వీనర్లుగా ఎంఆర్ నాయక్ (యోగి వేమన), అనిల్ (సెంట్రల్ యూనివర్సిటీ), ఆదిత్య (నాగార్జున), 27 మందిని కన్వీనింగ్ కమిటీ సభ్యులుగా నియమించినట్లు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారులు

గొర్రెలు, మేకల పెంపకందారుల ధర్నా

ప్రజాశక్తి -అనకాపల్లి (అనకాపల్లి జిల్లా)

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గొర్రెలు, మేకల పెంపకందారులు అనకాపల్లి కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ.. జిల్లాలో గొర్రెలు, మేకల మేత, నివాస స్థలాలను స్థానిక ప్రజాప్రతినిధులు అమ్ముకుంటున్నారని, దీనిని ఆపాలని డిమాండ్ చేశారు. జిల్లా యాదవ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కశింకోట మండలం తేగాడ గ్రామంలో సర్వే నంబర్ 103లో 35 ఎకరాల స్థలంలో 1996లో గొర్రెలు, మేకల మేత కోసం, రాత్రిపూట బసకోసం ఆ స్థలాన్ని అప్పటి తహశీల్దార్ కేటాయించారని తెలిపారు.

దీనిని స్థానిక ప్రజాప్రతినిధులు అమ్ముకోవడం వల్ల కొంతమంది అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని, వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపైన స్థానిక తహశీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉరిగిటి శివ సూర్యనారాయణ, గోకాడ దేముడునాయుడు మాట్లాడుతూ.. జిఒ 559, 1016 ప్రకారం గొర్రెలు, మేకల పెంపకందారులకు 25 ఎకరాల వరకు స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సర్వశుద్ధి తాతారావు, పల్లా వెంకయ్యనాయుడు, చందక నాగేశ్వరరావు, కుండలు శ్రీను, పక్కుర్తి వెంకట అప్పారావు, కుండలు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా విద్యార్థులు ఎదగాలి

- ఎఎన్‌యు 46, 47 వ్యవస్థాపక దినోత్సవంలో సజ్జల రామకృష్ణ
- ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

సమాజంలో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన ఉన్నతమైన వ్యక్తుల జీవితాలను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని, లక్ష్యాలు అందిపుచ్చుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆకాశమే హద్దుగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యవహారాల ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 46, 47 వ్యవస్థాపక దినోత్సవం వర్సిటీ డైక్‌మెన్ ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన 22మంది ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విసి, ప్రొఫెసర్ పి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో సజ్జల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం ఎంతో విశిష్టత సంతరించుకుంటుందని, ఇందుకు సిఎం జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ప్రపంచంలో బెస్ట్ యూనివర్సిటీలో విద్యను అభ్యసించే రాష్ట్ర విద్యార్థులకు ఎంతటి ఖర్చు అయినా భరించి గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దే విధంగా ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. 40 ఏళ్ల క్రితంతో పోల్చుకుంటే విద్యారంగంలో పెను మార్పులు వచ్చాయన్నారు. విసి పి రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది ద వీక్ అనే పత్రిక చేసిన పరిశోధనలో ఇండియాలోనే 15వ స్థానాన్ని వర్సిటీ కైవసం చేసుకుందని, 448 పబ్లికేషన్స్ సాధించిన యూనివర్సిటీగా వర్సిటీ పేరుందనీ అందులో 15 పేటెంట్ హక్కులు పొందిదని తెలిపారు. వర్సిటీలో డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ద్వారా రైతులకు, విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇన్నోవేషన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి కొత్త కొత్త ఆవిష్కరణలు చేసే విధంగా అధ్యాపకులను ప్రోత్సహిస్తున్నామని, ఇందుకోసం అర్హులైన అధ్యాపకులకు ఒక్కొక్కరికి రూ. రెండు లక్షలు చొప్పున సీడ్ మనీ అందిస్తున్నామని వివరించారు. మాజీ విసి ఆచార్య వి బాలమోహన్ దాస్ మాట్లాడుతూ తాను యూనివర్సిటీకి 13వ విసిగా ఉన్నప్పుడు ప్రారంభించిన వ్యవస్థాపక దినోత్సవం సమాజంలో పేరు ప్రతిష్టలు పొందిన వారిని గుర్తించి సత్కరించుకోవడం విద్యారంగానికి ఎంతో అవసరంగా పేర్కొన్నారు. నేడు ప్రతిభా పురస్కారాలను అందుకున్న వారు ఆయా రంగాలలో విశ్వవిద్యాలయ బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని ఆకాంక్షించారు.

దుర్గగుడి వద్ద ప్రధాన రహదారిపై విరిగిపడిన కొండ చరియలు

దుర్గగుడి వద్ద విరిగిపడిన కొండచరియలు

- ఐదు ద్విచక్ర వాహనాలు ధ్వంసం

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

విజయవాడ దుర్గగుడి వద్ద సోమవారం కొండ చరియలు విరిగిపడ్డాయి. గత రెండ్రోజులుగా కురిసిన వర్షాలకు దుర్గాఘాట్ ఎదురుగా కేశ ఖండన సమీపంలోని ప్రధాన రహదారిపై ఈ సంఘటన జరిగింది. ఈ ఘటనలో ఐదు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో దేవాదాయ శాఖ అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

కొండ చరియలు రోడ్డుపై పడడంతో భవానీపురం, గొల్లపూడి ప్రాంతాలకు వెళ్లే వాహనాలు, ఆర్‌టిసి బస్సుల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రత్యామ్నాయంగా అధికారులు ఫ్లైఓవర్ మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు.

సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి మంత్రి కొట్టు

సంఘటనా స్థలాన్ని ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. దుర్గగుడి ఇఒ డి భ్రమరాంబ, ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, దేవాలయ ఇంజనీరింగ్ అధికారులు, వెస్ట్ ఎసిపి కె హనుమంతరావు, సిఐ సురేష్‌రెడ్డి, వన్‌టౌన్ ట్రాఫిక్ సిఐ సుధాకర్, ఆలయ ఇంజనీర్లు కోటేశ్వరరావు, రమాదేవి తదితరులు వెంటనే అక్కడికి చేరుకుని ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. పొక్లయినర్ సాయంతో కొండ చరియల తొలగింపు చర్యలను పర్యవేక్షించారు. దుర్గగుడికి వెళ్లే రహదారిని రెండు వైపులా మూసివేశారు.

జైళ్ల పాలనలో మానవతా దృష్టి పెరగాలి

- 8వ జాతీయ కాన్ఫరెన్స్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా
- ఖైదీల సంక్షేమానికి పథకాలు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

జాతీయ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అజయ్‌కుమార్ మిశ్రా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఆరిలోవ

జైళ్ల పాలనలో రాష్ట్రాలు మానవతా దృష్టితో ఉండాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అజయ్‌కుమార్ మిశ్రా కోరారు. రెండ్రోజుల పాటు జరిగే 'జాతీయ స్థాయి మేథోమదనం' విశాఖలోని రుషికొండ సాయిప్రియా రెస్టారెంట్‌లో సోమవారం ప్రారంభమైంది. 'దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న అన్ని రకాల జైళ్లలో ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయి? 2047 సంవత్సరానికి వీటిని ఏ రకంగా పురోగతిలోకి తీసుకురావచ్చు.. 75 ఏళ్ల స్వతంత్ర్య భారతదేశంలో జైళ్లలో ఖైదీల సంక్షేమం, సంస్కరణలపై ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా ప్రారంభించి మాట్లాడారు. జైళ్ల పరిస్థితులను మెరుగుపరిచే టెక్నాలజీ విషయంలో పురోగతి సాధించాలన్నారు. నేరాలను నిరోధించేలా ఖైదీల్లో డి ఎడిక్షన్ కార్యకలాపాలను పెంచాలని, ముఖ్యంగా వారిలో మానసిక ఆరోగ్యం పెంచేందుకు తగిన కృషిని రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలని సూచించారు. 2023 న్యూ మోడల్ ప్రిజన్, సేవలు, అత్యధికంగా జైళ్లలోకి కుక్కబడుతున్న ఖైదీల విషయాలపై సమగ్రంగా రెండ్రోజుల పాటు చర్చించాలన్నారు. ఎపిలో ఈ మేథోమదనం ఇది రెండోసారి జరుగుతోందని వివరించారు. రాష్ట్రంలో జైళ్ల కండిషన్స్‌ను మెరుగుపరచడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు.

జైళ్లలో పలు సంస్కరణలు: తానేటి వనిత

రాష్ట్రంలోని జైళ్లలో పేదలైన ఖైదీలకు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత కార్పొరేట్ వైద్య సదుపాయం అమలు చేస్తున్నామని, మౌలిక వసతుల కల్పనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. శుద్ధమైన మంచినీరు, కరెంట్, పౌష్టికాహారం, రిక్రియేషన్ కల్పిస్తున్నట్లు వివరించారు. ఖైదీలలో నైపుణ్యాలను వెలికితీసేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను జైళ్లలో పెట్టామని, వారి ఉత్పత్తులను అమ్మేందుకు స్టాల్స్ ఏర్పాటు చేశామని వివరించారు. ఖైదీలకు చేయూత నిధిని, కార్పస్ ఫండ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. జైళ్లలో సెక్యూరిటీని పెంచామని, 12 అడిషనల్ సూపరింటెండెంట్ కేడర్ పోస్టులను (డిప్యూటీ, సూపరింటెండెంట్ మధ్య) ఏర్పాటు చేసుకునే అనుమతి ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు.

దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల నుంచి 99 మంది, కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల ఐజి, డిఐజిలు, సూపరిండెంట్‌లు హాజరయ్యారు. రెండోరోజు మంగళవారం జరగనున్న ముగింపు సదస్సులో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొననున్నారు.

అప్పు కట్టకుంటే తీహార్ జైలుకే..

- 22లోగా క్రెడిట్ సూస్సెకు రుణం చెల్లించాల్సిందే
- మీరు చచ్చినా బాధపడేది లేదు
- స్పైస్‌జెట్ ఛైర్మన్‌కు సుప్రీం తీవ్ర హెచ్చరిక

న్యూఢిల్లీ : విమానయాన సంస్థ స్పైస్‌జెట్ ఛైర్మన్ అజయ్ సింగ్‌కు అత్యున్నత న్యాయస్థానం తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. యూరోపియన్ బ్యాంక్ క్రెడిట్ సూస్సెకు ఈ నెల 22లోగా 5,00,000 డాలర్ల వాయిదా మొత్తం సహా డిఫాల్ట్ అయినా 10 లక్షల డాలర్లు (రెండూ కలిపి దాదాపు రూ.12 కోట్లు) చెల్లించాలని ఆదేశించింది. లేదంటే తీహార్ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, అహ్సనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. "క్రెడిట్ సూస్సె వద్ద తీసుకున్న రుణం చెల్లించకుంటే మేం తదుపరి తీవ్రమైన చర్య తీసుకోవాల్సి ఉంటుంది. మీరు సంస్థను మూసేసినా మాకు ఆందోళన లేదు. ఈ దాగుడు మూతల వ్యవహారం ఇక చాలు. మీరు షరతులకు కట్టుబడి ఉండాల్సిందే. మీరు ఒకవేళ చనిపోయిన మేం బాధపడం.. ఇది చాలా తీవ్రమైన అంశం. ఇకపై జరిగే ప్రతీ విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది.' అని అజయ్ సింగ్‌ను ఉద్దేశించి ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

2015 నుంచి క్రెడిట్ సూస్సె, స్పైస్‌జెట్ మధ్య న్యాయ వివాదం కొనసాగుతోంది. స్పైస్‌జెట్ తమకు 24 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.200 కోట్లు) బకాయిలు చెల్లించాల్సి ఉందని క్రెడిట్ సూస్సె ప్రకటించింది. దీనిపై మద్రాస్ హైకోర్టును ఆ బ్యాంక్ ఆశ్రయించింది. 2021లో స్పైస్ జెట్ సంస్థను మూసేయాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ స్పైస్‌జెట్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వంతో ఇరుపక్షాలు చర్చించుకుని పరిష్కారానికి రావాలని సూచించింది. కాగా.. గతేడాది ఆగస్టులో ఇరు పక్షాలు వివాద పరిష్కారానికి అంగీకారానికి వచ్చినట్లు సుప్రీంకోర్టుకు తెలిపాయి. అయినప్పటికీ ఇరు పక్షాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం కూడా స్పైస్‌జెట్ బకాయిలు చెల్లించలేదు. స్పైస్‌జెట్ నిర్లక్ష్య తీరుపై ఈ ఏడాది మార్చిలో క్రెడిట్ సూస్సె సుప్రీంకోర్టును ఆశ్రయించి.. కోర్టు దిక్కరణ పిటిషన్‌ను దాఖలు చేసింది. తాజాగా దీనిపై విచారించిన సుప్రీం బెంచ్.. అజయ్ సింగ్‌కు తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. తిరిగి ఈ కేసును సెప్టెంబర్ 22న విచారించనున్నట్లు అత్యున్నత న్యాయస్థానం తెలిపింది.

గ్రీన్‌ప్లై ప్రచారకర్తగా ఎన్‌టిఆర్

హైదరాబాద్ : భారత సంఘటిత ప్లైవుడ్ మార్కెట్‌లో 25-30 శాతం మార్కెట్ వాటాను కలిగివున్నామని గ్రీన్‌ప్లై ఇండస్ట్రీస్ జాయింట్ ఎండి, సిఇఒ మనోజ్ తుల్సియన్ అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రముఖ నటుడు జూనియర్ ఎన్‌టిఆర్‌ను తమ సంస్థకు ప్రచారకర్తగా నియమించినట్లు తెలిపారు. దేశంలో సంఘటిత, అసంఘటిత ప్లైవుడ్ మార్కెట్ దాదాపు రూ.32 వేల కోట్ల విలువ కలిగివుందన్నారు. గతేడాది రూ.1800 కోట్ల రెవెన్యూ సాధించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2 వేల కోట్ల టర్నోవర్ అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

నిఫ్టీ తొలిసారి 20 వేల మార్క్

ముంబయి : నేషనల్ స్టాక్ ఎక్స్చేంజీ నిఫ్టీ తొలిసారి 20వేల మార్క్‌ను తాకింది. కొనుగోళ్ల మద్దతుతో నిఫ్టీ-50 ఓ దశలో 20,008 గరిష్ట స్థాయికి ఎగిసింది. తుదకు 176 పాయింట్లు లేదా 0.89 శాతం పెరిగి 19,996 వద్ద ముగిసింది. బిఎస్ఇ సెన్సెక్స్ 528 పాయింట్లు రాణించి 67,127 వద్ద ముగిసింది. బిఎస్ఇలో అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అపోలో హాస్పిటల్స్, హిందాల్కో, పవర్ గ్రిడ్, యుపిఎల్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.2 శాతం, 0.7 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీలో పిఎస్‌యు బ్యాంకింగ్ సూచీ 3 శాతం పెరగ్గా.. లోహ, ఆటో సూచీలు 1.7 శాతం చొప్పున పెరిగాయి. ఢిల్లీలో నిర్వహించిన జి20 శిఖరాగ్ర సదస్సు విజయవంతం కావడంతో మార్కెట్లలో విశ్వాసం పెరిగిందని బ్రోకర్లు పేర్కొన్నారు.

ప్రతి ఎకరాకూ నీరందే వరకు పోరాటం

- ఎపి రైతు సంఘం

దేవనకొండ మండలంలో కొనసాగుతున్న పాదయాత్ర

ప్రజాశక్తి - దేవనకొండ (కర్నూలు)

హంద్రీనీవా కాలువ ద్వారా కర్నూలు జిల్లా దేవనకొండ మండలంలోని ప్రతి ఎకరాకూ సాగునీరందే వరకు పోరాడతామని రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అందుకు రైతులందరూ ఐక్యంగా సంఘటితమై ఉద్యమించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన 'రైతుల పాదయాత్ర' సోమవారం గుండ్లకొండ నుంచి నేలతలమర్రి మీదుగా దేవనకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు రైతులు పంటలు సాగు చేశారని, ఆ తర్వాత తీవ్ర వర్షాభావం నెలకొనడంతో మొక్కలు గిడసబారిపోయాయని తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 40వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా వ్యవసాయ కార్మికులకు అదనంగా వందరోజుల పని కల్పించాలని కోరారు. హంద్రీనీవా కాలువ మరమ్మతులకు వైసిపి ప్రభుత్వం ఈ నాలుగేళ్ల కాలంలో నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. పంట కాలువల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో మండలంలోని 46 వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదని తెలిపారు. గుండ్లకొండ వద్ద స్లూయిజ్ ఏర్పాటు చేసి పి.కోటకొండ, మాచాపురం గ్రామాల వరకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథులుగా వచ్చిన రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రామకృష్ణ, వెంకటేశు, వ్యకాస జిల్లా అధ్యక్షులు వీర శేఖర్ మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు రైతుసంఘం మండల కార్యదర్శి సూరి అధ్యక్షత వహించారు.

పోలీసుల ఆంక్షలతో సాగిన పాదయాత్ర

రాష్ట్రంలో 144 సెక్షన్ అమలులో ఉండడంతో పోలీసుల ఆంక్షలతో పాదయాత్ర కొనసాగింది. గుండ్లకొండ నుంచి నేలతలమర్రి మధ్యలో పాదయాత్రను ఆపాలని ఎస్ఐ భూపాలుడు ప్రయత్నించారు. రైతుల కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నామని, రాజకీయ పార్టీల కోసం తాము పోరాడడం లేదని రైతు సంఘం నాయకులు చెప్పారు. దీంతో, పాదయాత్ర యధావిధిగా కొనసాగింది.

మూడో తరగతి నుంచే టోఫెల్ శిక్షణ

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మూడో తరగతి నుంచే టోఫెల్ శిక్షణ అందిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ఇంగ్లీష్ మాట్లాడటం, చదవడం, రాయడం, అర్థం చేసుకోవడంలో ఏ స్థాయిలో ఉన్నామో తెలుసుకునేందుకు ఉపయోగపడే టోఫెల్ పరీక్ష రాసే అవకాశాన్ని కల్పిస్తున్నామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీష్‌పై పట్టు పెంపొందించాలనే స్వప్నంతో మూడో తరగతి నుంచే టోఫెల్ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదివే విద్యార్థులకు టోఫెల్ ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఇంగ్లీష్ పాఠాలు చెప్పడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సృష్టించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లీష్‌లో మాట్లాడేలా ఉపాధ్యాయులు ప్రోత్సాహించాలని తెలిపారు. విద్యార్థులు బైజూస్ కంటెంట్ ట్యాబులను విద్యార్థులు పూరిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల జీవితాల్లో టోఫెల్, బైజూస్ ట్యాబ్ కంటెంట్ ఒక భాగం కావాలని తెలిపారు.

14నుంచి జాగల్ ఐపిఒ

- ధరల శ్రేణి రూ.156-164

హైదరాబాద్ : ఫిన్‌టెక్ సంస్థ జాగల్ ప్రీపెయిడ్ ఓసియన్ సర్వీసెస్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు వస్తోంది. ఈ నెల 14న ఇష్యూ ప్రారంభమై.. 18తో ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ సెప్టెంబర్ 13న ప్రారంభమవుతుంది. సోమవారం వర్చ్యువల్‌గా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ ఎండి, సిఇఒ అవినాష్ రమేష్ గొడ్‌ఖిండి, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రాజ్ పి నారాయణమ్, సిఎఫ్ఒ ఆదిత్యా కుమార్ గ్రంధి మాట్లాడుతూ.. ఐపిఒ వివరాలను వెల్లడించారు. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.392 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఇష్యూలో 1.04 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయించనుంది. కంపెనీ ప్రమోటర్లు రాజ్ పి నారాయణమ్, అవినాష్ రమేష్ గోడ్‌ఖిండిలు సహా ఇందులో వాటాలు కలిగిన పలు సంస్థలు తమ వాటాలను విక్రయిస్తున్నారు. ఈ ఇష్యూలో కనిష్టంగా 90 ఈక్విటీ షేర్లు, ఆ తర్వాత 90 ఈక్విటీ షేర్ల గుణిజాలలో బిడ్లు వేయడానికి వీలుందని ఆ వర్గాలు తెలిపాయి.

HDFC BANK
We understand your world

రిజిస్టర్డు ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబయి-400 013 మరియు రిటైల్ పోర్ట్‌ఫోలియో మేనేజిమెంట్‌గా దీని ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, ఐ-థింక్ టెక్నో క్యాంపస్, కంజుర్‌మార్గ్ (ఈస్ట్), ముంబయి-400042.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కు తాకట్టుపెట్టిన ఆస్తుల అమ్మకం కొరకు అమ్మకం సమాచారం& బహిరంగ ప్రకటన.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ("ది బ్యాంక్") యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు ఇందుమూలంగా, నేచర్ ఆఫ్ లోన్/ సెక్యూరిటీస్ పై ఓవర్‌డ్రాఫ్ట్ లో రుణసదుపాయాలు పొందుట కొరకు, బ్యాంకుకు తాకట్టుపెట్టబడిన సెక్యూరిటీస్ అమ్మకం గురించి ప్రకటన ఇవ్వడమైనది.

రుణ ఒప్పందాల నియమాల ప్రకారం బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటలో రుణగ్రహీతలు పెర్‌సిస్టెంట్ డిఫాల్టిచెందిన కారణంగా, దిగువ రుణ ఖాతాలు డెలింక్వెంట్ స్థితిలో ఉన్నవి. ఏదైతే దిగువ పేర్కొన్న తేదీలపై ఫైనల్ అమ్మకపు నోటీసుతో కలిపి అట్టి రుణగ్రహీతలకు అనేక నోటీసులును బ్యాంకు జారీచేసింది, బ్యాంక్ తాకట్టు ఇన్‌వోక్డ్ అయి, దిగువ ఖాతాల్లో పూర్తి బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటకు రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇవ్వబడినది, విఫలం చెందిన ఏదైతే, ఈ విషయంలో తదుపరి నోటీసు ఇవ్వకుండానే తాకట్టుపెట్టిన సెక్యూరిటీస్‌ను బ్యాంకు అమ్మ ఆస్కారం ఉంటుంది.

రుణగ్రహీతలు అశ్రద్ధచేసి, బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందారు, అందుకుగాను, బ్యాంకు రుణ ఒప్పందాల క్రింద దీని హక్కులను వినియోగించుకొని, బ్యాంకుకు రుణగ్రహీతలచేత స్వంతమైన బకాయిలను రికవరీచేయుట కొరకు 19 సెప్టెంబర్, 2023న లేదా ఆ తరువాత సెక్యూరిటీస్‌ను విక్రయించు/ డిస్పోజ్‌చేయుటకు నిర్ణయించింది. కావలసిన మార్జిన్‌లో తదుపరి డెఫిసెన్సీని క్రియేట్‌చేయుటకు స్టాక్ మార్కెట్‌లో వోలటిలిటీకు తదుపరి బకాయి వచ్చు తాకట్టుపెట్టిన ఆస్తుల విలువ వేసి ఈ విషయంలో ఏదేని తదుపరి నోటీసు ఇవ్వకుండానే ఒక (1) క్యాలెండర్ రోజులోగా తాకట్టుపెట్టిన సెక్యూరిటీని విక్రయించుటకు బ్యాంకు నిర్ణయించింది. తాకట్టుపెట్టిన ఆస్తుల అమ్మకం కు ముందుకుసాగుట యొక్క ఏవేని మిగతా బకాయి మొత్తాలు, పోస్టు అడ్జస్టెమెంట్ ను రుణగ్రహీతలు తిరిగి చెల్లించుట కొరకు ఆస్కారం ఉంటుంది.

క్ర. సం.	రుణ ఖాతా నంబరు	రుణగ్రహీతల పేర్లు	7 సెప్టెంబర్, 2023 నాటికి బకాయి మొత్తాలు	అమ్మకం ప్రకటన తేది
1	XXXX1308	డి.ఎ.పి.ఆర్. సరోజిని దేవి	1,929.82	04-Sep-23
2	XXXX7463	విశ్వ ప్రసాద్ రేవూరి	66,069.16	04-Sep-23

తేది: 12.09.2023
ప్రదేశం: ఆం.ప్ర.
సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటులో భారీ అవినీతి జరిగిందన్న అభియోగాలపై మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబును సిఐడి పోలీసులు అరెస్టు చేయగా, ఎసిబి కోర్టు ఆయనకు రెండు వారాల రిమాండ్ విధించింది. కాగా చంద్రబాబు అరెస్టు సమయంలో సిఐడి అవలంబించిన తీరు అభ్యంతరకరం. ఆయన హోదా, వయసు, పౌర హక్కులు, చట్ట నియమ నిబంధనలను సిఐడి తుంగలో తొక్కడం ప్రభుత్వ నిర్బంధ వైఖరికి నిదర్శనం. జిల్లా పర్యటనలో ఉన్న చంద్రబాబు నంద్యాలలో శుక్రవారం రాత్రి బస్సులో బస చేయగా, పదకొండు గంటలప్పుడు ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తుల పట్ల వ్యవహరించినట్లు పోలీసులు చుట్టుముట్టి భీతావహం సృష్టించారు. శనివారం ఉదయం ఆరు గంటలకు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించి, వందల కిలోమీటర్ల దూరాన ఉన్న విజయవాడకు తీసుకొచ్చి, ఆ రాత్రంతా సిట్ కార్యాలయంలో ప్రశ్నించి, ఆపై ఆదివారం ఉదయం కోర్టులో ప్రవేశపెట్టగా, కోర్టు తీర్పు వచ్చేసరికి సాయంత్రం ఆరైంది. జోరు వర్షంలోనే అర్ధరాత్రి ఒంటిగంటకు రాజమండ్రి సెంట్రల్ జైలుకు చేర్చారు. ఈ తంతు యావత్తూ వేధింపు కోసమేనన్న రీతిలో సాగిందన్నది పలువురి విమర్శ. దర్యాప్తు నిష్పక్షపాతంగా వాస్తవాల ఆధారంగా జరగాలి.

రాష్ట్రంలో ప్రభుత్వ నిరంకుశ చర్యలు ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నాయి. రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన భావప్రకటన, నిరసన తెలిపే హక్కులు కాలరాయబడుతున్నాయి. ఏ చిన్న నిరసనను, ఊరేగింపులను, నిర్దాక్షిణ్యంగా సర్కారు పోలీసులతో అణచివేస్తోంది. ఉపాధ్యాయులు, స్కీం వర్కర్లు, కార్మికులు, ప్రతి ఒక్క తరగతి వారి నిరసనను కేసులు, అక్రమ నిర్బంధాలు, హౌస్ అరెస్టులతో నిలువరిస్తోంది. శ్రామిక ప్రజల ఆందోళనలను అణచివేయడంలో నాటి చంద్రబాబు ప్రభుత్వానికి ఈనాటి జగన్ సర్కారుకు పెద్ద తేడా ఏమీ లేదు. తాజాగా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి బంద్, నిరసనలను అరెస్టులతో అడ్డుకుంది. ప్రజాస్వామ్యంలో ఒకే పార్టీ అధికారంలో ఎల్లకాలం శిలేసుకొని ఉండదు. ప్రజలు ఆగ్రహిస్తే ప్రతిపక్షంలోకి పోతుంది. అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తే అదే ప్రతిపక్షంలోకొచ్చాక రక్షణగా ఉంటుంది. పాలకులు అప్రజాస్వామ్యాన్ని ఎంచుకుంటే అదే ప్రతిపక్షంలోకొచ్చాక తమ మెడకు చుట్టుకుంటుందన్న స్పృహ ఉండాలి. విపక్షంలో ఉండగా వైసిపి సైతం కేసులెదుర్కొన్నదని నిర్బంధాలను అనుభవించిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. అధికారంలో ఉన్న పార్టీ ప్రతిపక్షాలపై నిర్బంధం ప్రయోగించాలన్న ధోరణి ప్రజాస్వామ్యానికి, మానవ హక్కులకు ప్రమాదం. కేంద్రంలో బిజెపి వచ్చాక ప్రజాస్వామ్యం, ప్రజాతంత్ర హక్కుల అతిక్రమణ సాగుతోంది. బిజెపి నుంచి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నేర్చుకుంటున్నాయి. నిరంకుశ చర్యలను ప్రజలందరూ వ్యతిరేకించినప్పుడే ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టగలుగుతుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటులో రూ.270 కోట్ల ప్రభుత్వ నిధులను డొల్ల కంపెనీలు నెలకొల్పి పథకం ప్రకారం చంద్రబాబు వ్యక్తిగత లబ్ధి పొందారన్నది సిఐడి ఆరోపణ. ఇదంతా వైసిపి ప్రభుత్వ కక్ష సాధింపని చంద్రబాబు, టిడిపి వాదన. అయితే కేసు నమోదు, దర్యాప్తు తీరునుబట్టి సహజంగానే సందేహాలొస్తాయి. 2015-16లో జరిగిందంటున్న అవినీతిపై వైసిపి వచ్చాక 2021లో కేసు నమోదైంది. సిఐడి కొంత మందిని అరెస్ట్ చేసి ఛార్జిషీట్ వేసింది. నిందితులు బెయిల్ మీద విడుదలయ్యారు. హైకోర్టులో విచారణ పూర్తయి తీర్పు రిజర్వ్ అయింది. తొలుత ఎఫ్ఐఆర్‌లో లేని చంద్రబాబు పేరు అనూహ్యంగా ఇప్పుడు ముందుకొచ్చింది. ఐపిసి సెక్షన్ 409 వర్తిస్తుందా, అవినీతి నిరోధక కేసు కాబట్టి ప్రజాప్రతినిధి అరెస్ట్‌కు గవర్నర్ పర్మిషన్ తీసుకోవాలా అనేవి సాంకేతిక విషయాలు. చట్టాలను దర్యాప్తు సంస్థలు పాటించాల్సిందే. అవినీతి కేసుల్లో ప్రభుత్వం నిష్పక్షపాత దర్యాప్తు జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలనే ఎవరైనా కోరుకుంటారు. న్యాయస్థానాలే స్కిల్ డెవలప్‌మెంట్ కేసు నిగ్గు తేల్చాలి.

మహనీయుల మాట



ఏ విషయాన్నయినా
నిగ్రహం కోల్పోకుండా
వినగలిగే సామర్థ్యాన్ని
విద్య ప్రసాదిస్తుంది.
- రాబర్ట్ ఫ్రాస్ట్,
అమెరికన్ కవి.

పెట్టుబడిదారీ వ్యవస్థ - కప్పిపుచ్చలేని లోపాలు

ప్రజా ప్రస్థానం

ప్రభాత్ పట్నాయక్

పెట్టుబడిదారీ వ్యవస్థ నిజానికి చాలా మంచిదని, దానిలో స్వత:సిద్ధంగా ఎటువంటి లోపాలూ లేవని, ఎక్కడైనా లోపాలు తలెత్తితే దానికి కారణం అప్పుడు పాలిస్తున్న ప్రభుత్వాలు చేసే పొరపాట్లేనని కొందరు ఉదారవాద బూర్జువా రచయితలు చెప్తారు. ఆ విధంగా చేయడంవల్ల వాళ్ళు నమ్ముకున్న స్వంత, తప్పుడు సిద్ధాంతాలపై నమ్మకాన్ని కొనసాగిస్తూ వుండవచ్చు, మరోపక్క ఆ వ్యవస్థ వలన తలెత్తే ఇబ్బందులకు రాజకీయ నాయకులను బాధ్యుల్ని చేసి వారి చేతకానితనాన్ని నిందించనూవచ్చు. అంతర్జాతీయ వాణిజ్యం అందరికీ లాభదాయకంగా ఉంటుందని చెప్పడం కూడా అటువంటి ఒక ప్రయత్నమే. పెట్టుబడిదారీ విధానాన్ని అందంగా చిత్రించే ప్రయత్నమే. సామ్రాజ్యవాద దేశాలు తాము ఆక్రమించుకున్న దేశాలపై శతాబ్దాల పాటు పెత్తనం సాగించాయి. ఆ వలస దేశాల ఆర్థిక వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసేశాయి. ఆ దేశాల్లో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోడానికి కారణం సామ్రాజ్యవాద దేశాలు తమ వలసలను కొల్లగొట్టేందుకు వీలు కల్పించే విధంగా వాణిజ్య సంబంధాలను బలవంతంగా అమలు చేశాయి. ఈ అనుభవాల తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థను అందంగా చూపించడం సాధ్యం కాదు. కాని, ఉదారవాద బూర్జువా పండితుల సిద్ధాంతాల్లో ఎక్కడా వలస దోపిడీ అన్న పదమే కనిపించదు!

అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటే అది భాగస్వామ్య దేశాలన్నింటికీ లాభదాయకంగా ఉంటుంది అని ఉదారవాద ఆర్థికవేత్తలు అంటారు. ఆ విధంగా ఒప్పందాలు కుదుర్చుకునే దేశాలన్నింటిలోనూ ఉపాధి కల్పన పూర్తి స్థాయిలో ఉంటుందని, పూర్తి స్థాయిలో ఉత్పాదక సామర్థ్యం వినియోగంలోకి వస్తుందని వాళ్ళు ఊహించుకుంటారు. ఆ ప్రాతిపదికనే వారి సిద్ధాంతాన్ని రూపొందించారు. ప్రతీ దేశమూ తనకు ఏ యే రకాల సరుకుల ఉత్పత్తిలో ప్రత్యేక నైపుణ్యం ఉందో ఆ నైపుణ్యం కూడా పూర్తి స్థాయిలో వినియోగించబడుతుందని వీళ్ళు ఊహించుకుంటారు. ఆ పరిస్థితిలో మొత్తంగా అన్ని దేశాలనూ కలిపి చూసుకుంటే ప్రపంచ ఉత్పత్తి పెరుగుతుంది. అందువలన వాణిజ్యంలో భాగస్వాములందరికీ ప్రయోజనం చేకూరుతుందని, ఒక వేళ ఏ కారణంవల్లనైనా ఒక దేశానికి ప్రయోజనం కలగకపోయినా, నష్టం మాత్రం కలగదని వారంటారు.

ఉత్పత్తికి సంబంధించిన అన్ని అంశాలూ (పూర్తి స్థాయిలో ఉపాధి, పూర్తి స్థాపక సామర్థ్యం మేరకు ఉత్పత్తి, వగైరా) అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే ముందుగాని, ఆ తర్వాతగాని గరిష్ట స్థాయిలో అమలులోకి రావడం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలలో జరగనే జరగదు. ఈ సంగతి స్వయంగా ఉదారవాద బూర్జువా ఆర్థికవేత్త అయిన జాన్ మేనార్డ్ కీన్స్ చెప్పాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎప్పుడూ జరిగే ఉత్పత్తికి సరితూగే స్థాయిలో డిమాండ్ ఉండదని, అందుకే ఆ వ్యవస్థ నిరంతరం అధికోత్పత్తి సమస్యను ఎదుర్కొంటూ వుంటుందని ఆయన అన్నాడు. అందువలన ఇతర దేశాలతో వాణిజ్యం అంటే తన వాణిజ్య భాగస్వామి దేశానికి తన నిరుద్యోగాన్ని ఎగుమతి చేయడమే అని వ్యాఖ్యానించాడు. అంటే భాగస్వామి దేశం నుండి తెచ్చుకునే దిగుమతులకన్నా, ఆ దేశానికి చేసే ఎగుమతుల విలువ ఎక్కువగా ఉండేటట్టు చూసుకోవాలి. తన దేశంలో డిమాండ్ కు ఎంత ఎక్కువ మోతాదులో కొరత ఉంటే, అంత మేరకు నిరుద్యోగం పెరుగుతుంది. దానిని తగ్గించాలంటే అంత ఎక్కువ మోతాదులో విదేశీ వాణిజ్యంలో మిగులు ఉండేట్టు చూసుకోవాలి. అప్పుడు తన భాగస్వామి దేశానికి ఎగుమతి చేయడానికి అవసరమైన సరుకులను ఉత్పత్తి చేయడానికి తన దేశంలో ఉపాధి కల్పించడానికి వీలౌతుంది. ఇక్కడ ఉపాధి పెరిగిన సమయంలోనే ఆ భాగస్వామి దేశంలో ఆ మేరకు అదనంగా నిరుద్యోగం పెరుగుతుంది. ఒకవేళ ఆ భాగస్వామి దేశం పెట్టుబడిదారీ వ్యవస్థలో లేకపోయినా, అక్కడికి కూడా నిరుద్యోగం ఎగుమతి అవుతుంది.

సరుకులు, సేవలు, పెట్టుబడులు (ద్రవ్య పెట్టుబడులతో సహా) సాపేక్షంగా నిరాటంకంగా దేశాల హద్దులను దాటి తరలించగలగడం నయా ఉదారవాద వ్యవస్థ ప్రధాన లక్షణం. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు భాగస్వామ్య దేశాలన్నింటికీ ప్రయోజనకరంగా ఉంటాయన్న బూర్జువా వర్గ వాదనను ముందుకు తెచ్చింది ఈ నయా ఉదారవాద వ్యవస్థను నెలకొల్పడానికే. కాని అమెరికాలో హౌసింగ్ బుడగ ఒక్కసారి పేలిపోవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అధికోత్పత్తి సంక్షోభంలో దీర్ఘకాలం పాటు మునిగిపోయింది. అప్పటి నుంచీ ఇతర దేశాల దిగుమతుల తాకిడి నుండి తన దేశాన్ని కాపాడుకునే చర్యలు చేపట్టే ప్రహసనం మొదలైంది. ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకునే బదులు ఆ సరుకులను స్వదేశంలోనే ఉత్పత్తి చేయాలన్న ఆలోచన ముందుకొచ్చింది. అప్పుడు స్వదేశంలో ఉద్యోగాల కల్పన పెరుగుతుంది, అంటే దాని ఫలితంగా తక్కిన దేశాలలో నిరుద్యోగం పెరుగుతుంది. ఇది నిరుద్యోగాన్ని ఎగుమతి చేయడమే. మూడవ ప్రపంచ దేశాలు రక్షణ విధానాలను విడిచిపెట్టి నయా ఉదారవాద విధానాలను అనుసరించాలని ముందు ఒత్తిడి తెచ్చినది సంపన్న పెట్టుబడిదారీ దేశాలు. అవే దేశాలు ఇప్పుడు తమ తమ దేశాల్లో రక్షణ విధానాలను అమలు చేయడానికి పూనుకుంటున్నాయి. అంటే నయా ఉదారవాద వ్యవస్థ నియమాలను ఈ సంపన్న దేశాలే ఉల్లంఘిస్తున్నాయన్నమాట. ఈ దేశాలన్నీ ప్రత్యేకించి చైనాను తమ లక్ష్యంగా చేసుకున్నాయి. ఎగుమతులను పెంచడం ద్వారా అభివృద్ధి సాధించిన దేశంగా చైనా ఒక ఉదాహరణగా నిలుస్తుంది. ఇంతవరకూ చైనాలో పెట్టుబడులు పెట్టి అక్కడ చవకగా ఉత్పత్తి చేసిన సరుకులను తిరిగి తమ దేశాలకు ఎగుమతి చేస్తూ వచ్చాయి ఈ సంపన్న దేశాలు.

> ఏదైనా ఒక దేశం, అందునా, ఒక పెద్ద దేశం ఎగుమతులను పెంచడం ద్వారా అధిక వృద్ధిరేటును సాధించాలన్న వ్యూహాన్ని అనుసరిస్తే, ఆ దేశం మీద సామ్రాజ్యవాద దేశాలు కన్నెర్ర చేస్తాయి. అధికోత్పత్తి సమస్య ఉన్నా, లేకపోయినా, ఒక మూడవ ప్రపంచ దేశం గనుక ఎగుమతులను పెంచి దిగుమతులను తగ్గించుకుంటే సామ్రాజ్యవాద దేశాల నుండి ప్రతి చర్యలు తప్పవు.

ఇప్పుడు అమెరికా చైనా నుండి దిగుమతులను తగ్గించే 'రక్షణ' విధానాలను అనుసరించడం చూస్తున్నాం. ఐతే ఈ విధంగా నయా ఉదారవాదపు 'స్వేచ్ఛా వ్యాపార' విధానాలకు భిన్నంగా వ్యవహరించడానికి కారణం అమెరికా చైనా పట్ల రాజకీయంగా అనుసరిస్తున్న శత్రు వైఖరి అని ఉదారవాద బూర్జువా పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. ఐతే అధికోత్పత్తి అనే ధోరణి పెట్టుబడిదారీ వ్యవస్థలోనే ఒక ధోరణిగా ఉన్నందువలన దాని ఫలితంగా వచ్చిన సంక్షోభం అమెరికాను, పశ్చిమ సంపన్న దేశాలను రక్షణ విధానాలను చేపట్టేలా చేసింది. అంతే తప్ప ఇదేదో కేవలం రాజకీయ శత్రుత్వం వల్ల కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థకు మొదటి నుండీ సంక్రమించిన జబ్బు (అధికోత్పత్తి) వలన ఆ దేశాలు చైనా పట్ల ఈ విధంగా వ్యవహరిస్తున్నాయని ఉదారవాద పండితులు ఎందుకు గుర్తించరు? పెట్టుబడిదారీ వ్యవస్థ స్వత:సిద్ధంగా లోపరహితం అని వారు భావించడమే కారణం. ఈ రాజకీయ శత్రుత్వమే గనుక లేకపోయినట్టైతే అంతర్జాతీయ వాణిజ్యం మూడు పువ్వులు-ఆరు కాయలుగా సాగిపోయేదని వారు వాదిస్తారు.

దిగుమతులను తగ్గించి, ఎగుమతులను పెంచడం ద్వారా భాగస్వామ్య దేశాలకు తమ నుండి నిరుద్యోగాన్ని ఎగుమతి చేస్తూ తాము మాత్రం సంక్షోభం నుండి బైటపడాలని, ఈ క్రమంలో భాగస్వామ్య దేశం అడుక్కుతిన్నా తనకు అనవసరం అని అనుకునే ధోరణి 1930 దశకంలోని మహామాంద్యం కాలంలో బలంగా వ్యక్తం అయింది. ఆ కాలంలో ప్రభుత్వ వ్యయాన్ని పెంచి తద్వారా డిమాండ్ ను బాగా పెంచే ప్రయత్నాలను అప్పుడు ఎక్కడా చేయలేదు. ఒక్క ఫాసిస్టు దేశాలు మాత్రమే యుద్ధానికి సిద్ధం అవుతూ అందుకవసరమైన సన్నాహాలకోసం ప్రభుత్వ వ్యయాన్ని బాగా పెంచాయి. రూజ్‌వెల్ట్ ఆ 1930 దశకంలోనే 'న్యూ డీల్' ను ప్రతిపాదించాడు. ప్రభుత్వ వ్యయాన్ని పెంచడమే ఆ ప్రతిపాదన ముఖ్యాంశం. దాని ఫలితంగా అమెరికన్ ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడం ప్రారంభించింది కూడా. ఐతే ఆ వెంటనే న్యూ డీల్‌ను పక్కన పెట్టారు. దాని వలన తిరిగి సంక్షోభం మొదటికొచ్చింది. యుద్ధం ముంచుకొస్తోంది అని గుర్తించిన తర్వాతనే పెట్టుబడిదారీ దేశాలు తమ తమ ఆయుధాల నిల్వలను పెంచుకోవడం కోసం ప్రభుత్వ వ్యయాన్ని పెంచాయి. కాని అంతవరకూ అంతర్జాతీయ వాణిజ్యంలో పోటీ పడి దిగుమతులను తగ్గించుకోవడం, మారకపు రేట్లను తగ్గించడం వంటి చర్యలు విస్తృతంగా చేపట్టారు. దాని వలన ఏ ఒక్క దేశంలోనూ సంక్షోభాన్ని తగ్గించుకోలేకపోయారు. ఐతే దిగుమతులకు బదులు స్వదేశంలోనే ఉత్పత్తి చేట్టాలన్న విధానం మూడో ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా లాటిన్ అమెరికా దేశాల్లో అమలు చేసినందువలన అక్కడ పారిశ్రామికీకరణకు బీజాలు పడ్డాయి. సామ్రాజ్యవాద దేశాలలో తలెత్తిన సంక్షోభం మూడో ప్రపంచ దేశాల పారిశ్రామికీకరణకు దారి తీసింది.

ప్రస్తుతం మళ్ళీ చైనా ఎగుమతులకు కళ్ళెం వేయాలన్న పేరుతో సామ్రాజ్యవాద దేశాలు రక్షణ విధానాలను చేపడుతున్నాయి. దానిని సమర్ధించుకోడానికి రాజకీయ శత్రుత్వాన్ని సాకుగా చూపుతున్నాయి. కాని వాస్తవానికి రక్షణ విధానాల ద్వారా చైనాకు నిరుద్యోగాన్ని ఎగుమతి చేయాలన్నదే వాటి ఉద్దేశ్యం.

ఐతే దీని వలన చైనా దెబ్బ తినిపోతుందనుకోలేం. గత కొన్ని సంవత్సరాలుగా చైనా ఎగుమతులను పెంచుకోడానికి బదులు, దేశీయంగా వినియోగాన్ని పెంచడం మీద ఎక్కువగా దృష్టి పెట్టింది. దానివలన అటు సామ్రాజ్యవాదుల ఎత్తుగడలను తిప్పికొట్టవచ్చు, పైగా దేశీయంగా రైతాంగపు అభిమానాన్ని తిరిగి పొందవచ్చు. నిజానికి కొద్ది సంవత్సరాల క్రితమే చైనా "సోషలిస్టు గ్రామీణ ప్రాంతాల దిశగా" అన్న డాక్యుమెంట్‌ను ఆమోదించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వ్యయాన్ని మరింత ఎక్కువగా పెంచడం ఆ డాక్యుమెంట్ సారాంశం.

ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే ప్రస్తుత పరిస్థితులలో ఎగుమతులను పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించాలన్న వ్యూహంలో ఉన్న లోటుపాట్లేమిటో తెలుస్తోంది. ఏదైనా ఒక దేశం, అందునా, ఒక పెద్ద దేశం ఎగుమతులను పెంచడం ద్వారా అధిక వృద్ధిరేటును సాధించాలన్న వ్యూహాన్ని అనుసరిస్తే, ఆ దేశం మీద సామ్రాజ్యవాద దేశాలు కన్నెర్ర చేస్తాయి. అధికోత్పత్తి సమస్య ఉన్నా, లేకపోయినా, ఒక మూడవ ప్రపంచ దేశం గనుక ఎగుమతులను పెంచి దిగుమతులను తగ్గించుకుంటే సామ్రాజ్యవాద దేశాల నుండి ప్రతి చర్యలు తప్పవు.

చైనా కంటె ముందు జపాన్ విషయంలో ఇదే జరిగింది. జపాన్ ఏ విధంగా చూసినా, సామ్రాజ్యవాదులకు శత్రు దేశం కానే కాదు. కాని ఆ దేశం అమెరికాతో చేసిన వ్యాపారంలో ఎగుమతులను పెంచగానే, అమెరికా జపాన్ పట్ల రక్షణ వ్యూహాన్ని అమలు చేసింది. దాని ఫలితంగా జపాన్ వృద్ధి ఒక్కసారి పడిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా అనుసరిస్తున్న విధానం జర్మనీ ఎగుమతులలో సాధిస్తున్న వృద్ధిని దెబ్బ తీయడానికి కూడా తోడ్పడుతుంది. రష్యా నుండి చౌకగా చమురు, సహజ వాయువులను రవాణా చేసే నార్డ్ స్ట్రీం పైప్‌లైన్‌ను యుద్ధం సాకుతో పేల్చివేశారు. దాని వలన జర్మనీ చౌకగా రష్యా నుండి చమురు, సహజ వాయువులను పొందలేని పరిస్థితి వచ్చింది. ఫలితంగా జర్మనీలో ఉత్పత్తి ఖర్చు పెరిగిపోయింది. ఇక సమీప భవిష్యత్తులో జర్మనీ తన ఎగుమతులను పెంచుకుని తద్వారా వృద్ధి సాధించే అవకాశాలు లేకుండా పోయాయి.

> కేవలం దిగుమతులను తగ్గించుకున్నంత మాత్రాన ఒకానొక దేశం వృద్ధి రేటును పెంచుకోజాలదు. దిగుమతులు తగ్గిస్తే, దాని ఫలితంగా దేశంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కాని అది ఒకసారి మాత్రమే జరుగుతుంది. ఆర్థిక వృద్ధిరేటును నిత్యం పెంచుకోవాలంటే దానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ఒక్కటే మార్గం. ద్రవ్యలోటును పెంచడం ద్వారా అయినా లేక పన్నుల ఆదాయాన్ని పెంచడం ద్వారా అయినా ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలి. కాని అందుకు నయా ఉదారవాద విధానాలు అనుమతించవు.

కేవలం దిగుమతులను తగ్గించుకున్నంత మాత్రాన ఒకానొక దేశం వృద్ధి రేటును పెంచుకోజాలదు. దిగుమతులు తగ్గిస్తే, దాని ఫలితంగా దేశంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కాని అది ఒకసారి మాత్రమే జరుగుతుంది. ఆర్థిక వృద్ధిరేటును నిత్యం పెంచుకోవాలంటే దానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ఒక్కటే మార్గం. ద్రవ్యలోటును పెంచడం ద్వారా అయినా లేక పన్నుల ఆదాయాన్ని పెంచడం ద్వారా అయినా ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలి. కాని అందుకు నయా ఉదారవాద విధానాలు అనుమతించవు. ప్రస్తుత సంక్షోభం నుండి తన దేశాన్ని కాపాడుకోవాలంటే ప్రధాన సామ్రాజ్యవాద దేశం అమెరికా, రక్షణ విధానాన్ని అనుసరించడం వరకే పరిమితం అయితే సరిపోదు. అంతకన్నా చాలా ఎక్కువ ప్రయత్నం అవసరం.

(స్వేచ్ఛానుసరణ)

సనాతన ధర్మమా.. సమతా ధర్మమా..?

వ్యాఖ్య

డి. రమాదేవి



సనాతన ధర్మం అంటే సమతా ధర్మమేనా? సమతా ధర్మం అయితే అసమానతలకు, అణిచివేతకు గురైన వారందరూ సంతోషంగా ఆమోదిస్తారు! కానీ వర్ణాశ్రమ ధర్మంతో కూడుకున్న సనాతన ధర్మం, స్వధర్మంతో కూడుకున్న సనాతన ధర్మం ఖచ్చితంగా నిర్మూలించాల్సిందే. డెంగ్యూ, కరోనా వైరస్ లాంటి సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలతో బిజెపి సవారీ చేయాలనుకుంటున్న సనాతన ధర్మాన్ని బోనులో నిలబెట్టినట్లు అయింది. మన రాష్ట్రంలో గత నెలలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పాఠశాలల్లో సనాతన ధర్మం గురించి బోధించాలని సర్క్యులర్ జారీ చేయడాన్ని విజ్ఞులైనవారు చాలామంది ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని వమ్ము చేస్తున్న బిజెపి వారు...సమ ధర్మాన్ని సాధించాలన్న లక్ష్యంతో ఏర్పడిన రాజ్యాంగాన్ని ఎందుకు తూట్లు పొడుస్తున్నారో? సనాతన ధర్మం పేరిట బ్రాహ్మణులు సంస్కారులంటూ వర్ణ వ్యవస్థను కాపాడేందుకు, హిందూ మత ఆధిపత్యాన్ని ఏర్పాటు చేసేందుకు ఎందుకు తహతహలాడుతున్నారో? ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి!

సనాతన ధర్మమంటే ఏమిటి? హిందూ ధర్మాన్ని పాటించడమే సనాతన ధర్మం అని వికీపీడియా చెప్తుంది. శాశ్వత సత్యమని, చరిత్రకు అతీతమైందని చెప్పబడుతున్నది. సనాతన ధర్మం లక్ష్యం ఏమిటి? మోక్షం, మరో జన్మ నుంచి విముక్తి. నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వర్తించడం ద్వారా ఉత్తమ జన్మ ఎత్తుతావని, ఉత్తమ జన్మ ద్వారా మోక్షాన్ని పొందుతావని ప్రచారం జరుగుతోంది. వర్ణాశ్రమ ధర్మం ఈ సనాతన ధర్మంలో భాగం. హిందూ మతానికి వర్ణాలు-కులాలే బలమని, కుల సంకరం కారణంగానే హిందూ మతం భ్రష్టు పట్టిందని కాలం చెల్లిన కులాన్ని పంగల కర్రల మీద నిలబెట్టేందుకు సాధుసంతుల పేర సామాన్యుల బుర్రలను విషతుల్యం చేస్తున్నారు. మరోవైపు కుల, మత అంతరాలతో సమాజంలో ఏర్పడిన విభజనలను ఉపయోగించుకుని విద్వేషాలను రెచ్చగొట్టి తమ అధికారాన్ని శాశ్వతం చేసుకునే దుస్సాహసం చేస్తున్నాయి ఆర్ఎస్ఎస్ శక్తులు. సనాతన ధర్మం అనే భావన వాస్తవానికి సనాతనమే కాదు గదా! వేద ప్రమాణాన్ని నిరాకరించి దు:ఖానికి కారణాన్ని నివారించాలని, సంఘ ధర్మాన్ని ప్రబోధించిన బుద్ధుడి నుండి స్వీకరించిన భావం. అందుకే భగవద్గీత క్షమా గుణం, ఓర్పు, నిజాయితీ, దయ, ఇతరులకు హాని కలిగించకుండా ఉండటం వంటి కార్యాచరణ గురించి చెప్పింది. మరి యుద్ధం చేయడం ఏమిటి? అంటే అది స్వధర్మం అని బుజ్జగించింది.

స్వధర్మం పేరిట గాంధీని, గౌరీ లంకేష్ లాంటి మహోన్నతులను హత్య చేయడం మాత్రమే కాదు, మత మారణకాండలను సృష్టించి దేశాన్ని వల్లకాడుగా మార్చేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు పూనుకున్నాయి.

ఈ సనాతన ధర్మం స్త్రీ ధర్మాలను కూడా ప్రబోధిస్తుంది. భర్త పట్ల భక్తి కలిగివుండడం స్త్రీ ధర్మం అంటున్నారు. భర్తను సుఖపెట్టడమే లక్ష్యంగా దాసిలా సేవ చేయాలి! మరి సమ ధర్మం అంటే భార్య పట్ల కూడా భక్తిని ప్రబోధించాలి కదా!

> సనాతన ధర్మంలో స్త్రీపురుషుల ధర్మాలు సమానమేనా? ధర్మార్థ కామ మోక్షాలు పురుష ధర్మాలా? ఇంటి పని, బిడ్డల పెంపకం స్త్రీలది మాత్రమేనా? కులాంతర వివాహాలు చేసుకున్న కూతుళ్ళను చంపడమే సనాతన ధర్మమా? భర్త చనిపోయిన స్త్రీలకు పసుపు, కుంకుమ, పూలు, శుభకార్యాలు నిషిద్ధమా? ఇదే సనాతన ధర్మం అయితే దీనిని నిర్మూలించవద్దా? బ్రాహ్మణ కులంలో పుడితే ఉత్తమ జన్మా? శూద్రుడు అయితే హీనమా? దళితులుగా పుడితే మనుషులుగానే లెక్కించరా? ఇలాంటి సనాతన ధర్మాన్ని కూకటివేళ్లతో పెళ్ళగించవద్దా?

రాజ్యాంగ విరుద్ధమైన వర్ణాశ్రమ ధర్మాలు, స్త్రీ ధర్మాలు సనాతన ధర్మం పేరిట దళితులను మహిళలను, ముస్లింలను హత్యలు చేస్తూ, ప్రచారం చేస్తున్నవారిని ఎన్ని సార్లు శిక్షించాలి? వారిని సమర్ధించేవారికి ఎంతటి శిక్ష వెయ్యాలి? ఉదయనిధి వ్యాఖ్యలతో మనోభావాలు దెబ్బతిన్నాయని హిందువులను రెచ్చగొట్టే అమిత్ షా అండ్ కో వీటికి సమాధానం చెప్పాలి.

మేము మహిళలం.. ప్రశ్నిస్తున్నాం..! సనాతన ధర్మంలో స్త్రీపురుషుల ధర్మాలు సమానమేనా? ధర్మార్థ కామ మోక్షాలు పురుష ధర్మాలా? ఇంటి పని, బిడ్డల పెంపకం స్త్రీలది మాత్రమేనా? కులాంతర వివాహాలు చేసుకున్న కూతుళ్ళను చంపడమే సనాతన ధర్మమా? భర్త చనిపోయిన స్త్రీలకు పసుపు, కుంకుమ, పూలు, శుభకార్యాలు నిషిద్ధమా? ఇదే సనాతన ధర్మం అయితే దీనిని నిర్మూలించవద్దా? బ్రాహ్మణ కులంలో పుడితే ఉత్తమ జన్మా? శూద్రుడు అయితే హీనమా? దళితులుగా పుడితే మనుషులుగానే లెక్కించరా? ఇలాంటి సనాతన ధర్మాన్ని కూకటివేళ్లతో పెళ్ళగించవద్దా?

చర్చ ప్రారంభమైంది కదా చర్చిద్దాం. ఒక్కరు ఆకలిగా ఉన్నా సహించలేనన్న వివేకానందుడు చెప్పిన ధర్మమా? మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటి నిలిచి వెలుగునన్న గురజాడ బోధించిన ధర్మమా? అన్ని మతాలు, వ్యవస్థలు బోధించిన సమభావన లక్ష్య సాధనగా రూపొందించుకున్న రాజ్యాంగ ధర్మమా? ఏది సమ ధర్మం? ఏ సనాతన ధర్మం కూడా శాశ్వతమైనది కాదు. మార్పులకు అతీతమైనది కాదు. ఇది హిందూ మతం మీద దాడి అంటూ బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం దీనిని వివాదం చేసి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారు. సనాతన ధర్మం పేరిట హిందూ మతంలో కుల అంతరాల దొంతరలను నిర్మూలించవద్దా? స్త్రీలపై ఉన్న ఆంక్షలు నిర్మూలించవద్దా? సాధారణ హిందూ మతస్తులు ఆచరణలో వీటిని మార్చుకునేందుకు, సంస్కరించుకునేందుకు ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు. హిందూముస్లింలు తమ సమస్యలు అధిగమించడానికి, కోర్కెలు నెరవేర్చుకోవడానికి రొట్టెల పండుగలో భాగమవుతారు. ఎన్నో సాంప్రదాయాలలో ఎన్నో మార్పులు మానవ హితం కోసం సాగుతున్నాయి. ఈ మార్పులకు అడ్డం పడుతున్నది ఆర్ఎస్ఎస్. కుహనా ధర్మాలను బోధించి, విద్వేషాలను సృష్టించి దేశాన్ని, దేశ ప్రజలను దోపిడీదారులుకు బలిచేస్తున్నది బిజెపి. సామాన్యుల జీవితాలను కష్టాలమయం చేస్తున్నది బిజెపి. సనాతన ధర్మం పేరిట సాగుతున్న హిందూత్వ (రాజకీయాలు) పైనే నా విమర్శ అన్నాడు ఉదయనిధి. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారాలు చేసిన వారికి మద్దతిస్తున్న వారికి ధర్మం గురించి మాట్లాడే అర్హత ఉందా? బ్రాహ్మణులు సంస్కారులంటూ అత్యాచార నిందితులను వదిలేసిన వారు ధర్మం గురించి మాట్లాడటం హాస్యాస్పదం కదా? ఆ దుర్మార్గాలను సమర్ధించే, ప్రోత్సహించే హిందూత్వను నిర్మూలిస్తేనే ప్రజలకు కావాల్సిన ధర్మ స్థాపన!

/ వ్యాసకర్త ఐద్వా రాష్ట్ర కార్యదర్శి /

★

జనవాక్యం

ఎటిఎంల మొరాయింపు ఖాతాదారులకు తలపోటు!

ఈ మధ్య కొన్ని మండల కేంద్రాలలో ఎటిఎం మెషిన్లు మొరాయించడం సర్వసాధారణ విషయంగా మారిపోయింది. దీంతో అయా మండల కేంద్రంలోని గ్రామాల ప్రజలు, స్థానిక మండల కేంద్రానికి చెందిన ఖతాదారులకు ఈ వ్యవహారం తలపోటుగా పరిణమించింది. ఎందుకంటే బ్యాంకులలో డబ్బును డిపాజిట్ చేసేందుకో, విత్ డ్రా చేసేందుకో వెళ్లే ఖాతాదారులు బ్యాంకులలో వుండే తీవ్ర రద్దీ వల్ల ఎక్కువగా ఎటిఎం మెషిన్లను ఆశ్రయిస్తూ వుంటారు. అయితే కొన్ని మెషిన్లు కేవలం డబ్బు డిపాజిట్ చేసేందుకు మాత్రమే ఉపయోగపడితే, మరికొన్ని కేవలం విత్ డ్రా చేసుకునేందుకు మాత్రమే ఉపయోగ పడుతుంటాయి. మరికొన్ని అసలు పనే చేయవు. ఒక వేళ పని చేసినా ఒక్కొక్కసారి అందులో డబ్బులు అందుబాటులో వుండవు. మరికొన్ని ఎటిఎం మెషిన్లలోని బటన్లు సైతం ఒక్కొక్కసారి స్టక్ అయ్యి ఉంటాయి. వాటిని గట్టిగా నొక్కితే గాని పనిచేయని పరిస్థితి. ముఖ్యంగా బాగా దెబ్బ తిని, పాత పడిన ఎటిఎం మెషిన్లను బ్యాంకు అధికారులు ఎప్పటికప్పుడు మార్చకుండా, వాటికి మరమ్మతులు చేయించకుండా కాలయాపన చేస్తున్నారు. మండల కేంద్రాలలోని బ్యాంకు అధికారులు ఇప్పటికైనా ఖాతాదారులను ఇబ్బందులపాలు చేయకుండా, ఇక్కట్లకు గురిచేయకుండా మంచి నాణ్యమైన ఎటిఎం మెషిన్లను అందుబాటులో వుంచాలి.

- బుగ్గన మధుసూదనరెడ్డి,
బేతంచెర్ల, నంద్యాల జిల్లా.

మా డిమాండ్లు నెరవేర్చండి

- ఆందోళనకు బెంగాల్ రవాణా కార్మికుల పిలుపు
- కనీస పెన్షన్, ఎనిమిది గంటల పనితో సహా 14 డిమాండ్లు • సిఐటియు మద్దతు

కోల్‌కతా : తమ డిమాండ్లు, హక్కుల సాధన కోసం పశ్చిమ బెంగాల్‌లోని రవాణా రంగానికి చెందిన కార్మికులు, ఉద్యోగులు ఏకమయ్యారు. రాష్ట్ర రవాణా శాఖ కాకుండా ఇతర అన్ని రవాణా రంగాలలో నెలవారీ కనీస పింఛను రూ.9,000 ఇవ్వాలని, ఎనిమిది గంటల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తం 14 డిమాండ్ల సాధన కోసం వారు పోరాడుతున్నారు. ఈ మేరకు వారు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చారు. వీరి పోరాటానికి సిఐటియు బాసటగా నిలిచింది. ఉపాధి పత్రాలు, గుర్తింపు కార్డులు, ఎనిమిది గంటల పని దినాలు, ఆరోగ్య బీమా సహా సామాజిక భద్రతా పథకాల అమలు, అక్రమంగా తొలగింపు అరికట్టడం, పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదలను తగ్గించడం, వివిధ రహదారుల పునరుద్ధరణ, పండుగలకు ముందు బోనస్‌లు మరియు అలవెన్సుల చెల్లింపు, ప్రయాణికుల ఛార్జీలను నిర్ణయించడంలో ప్రభుత్వ సహాయం వంటివి వీరి డిమాండ్లలో ఉన్నాయి. కోల్‌కతాలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పశ్చిమ బెంగాల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ వర్క్‌షాప్ జరిగింది. సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మాట్లాడుతూ.. "కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు నిబంధనల పేరుతో శ్రామిక ప్రజల ఆర్జిత హక్కులను నిర్వీర్యం చేసేందుకు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా నిరసనలు రావాలి" అని అన్నారు. రాష్ట్రంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు ఏకం కావాలనీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కోరారు.

సంక్షోభంలో రబ్బరు పరిశ్రమ

- నయా ఉదారవాద విధానాలే కారణం
- జాతీయ సెమినార్‌లో వక్తల విమర్శ

తిరువనంతపురం : నయా ఉదారవాద విధానాల అమలు కారణంగా దేశంలో రబ్బరు పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని తిరువనంతపురంలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సెమినార్ అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల కారణంగా చౌకగా సింథటిక్ రబ్బరు దేశంలోకి పెద్ద ఎత్తున దిగుమతి అయిందని, దీంతో చిన్నకారు రైతులు నష్టాల్లో కూరుకుపోయారని, గత మూడు దశాబ్దాలుగా ధరలు పడిపోయాయని తెలిపింది. పుచ్చలపల్లి సుందరయ్య స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సెమినార్‌కు రైతులు, కార్మికులు, వ్యాపారులు, రైతు నేతలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు హాజరయ్యారు. రబ్బరు పరిశ్రమపై దేశంలో సవివరమైన చర్చ జరగడం ఇదే మొదటిసారి.

ఈ సమావేశంలో రబ్బరు పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పంట దిగుబడి తగ్గడం, చెట్లు పక్వానికి రావడంలో ఆలస్యం జరగడం, కార్పొరేట్ సంస్థల పెత్తనం, టైర్ల కంపెనీలు కుమ్మక్కై ధరలు తగ్గించడం వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. రబ్బరు పరిశ్రమను కార్పొరేటీకరించడం మానుకొని సహకార దిశగా ముందుకు తీసికెళ్లాలని, దీనివల్ల ఉత్పత్తిదారులు, వినియోగదారులు లబ్ది పొందుతారని సెమినార్ సూచించింది.

రబ్బరు ధరలు పడిపోతున్నప్పటికీ కనీస మద్దతు ధరను నిర్ణయించేందుకు కేంద్రం నిరాకరిస్తోంది. వాణిజ్య ఒప్పందాలను సాకుగా చూపి రబ్బరు దిగుమతులపై ఆంక్షలు విధించడం లేదు. మరోవైపు దేశంలో పేరెన్నికగన్న అపోలో టైర్స్ లిమిటెడ్, ఎంఆర్ఎఫ్ లిమిటెడ్, సియట్ లిమిటెడ్, జేకే టైర్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, బిర్లా టైర్స్ లిమిటెడ్ కుమ్మక్కై రబ్బరు ధరలను తగ్గించాయి. దీనిపై స్పందించిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆ కంపెనీలకు రూ.1,788 కోట్ల జరిమానా విధించింది.

సెమినార్‌ను ప్రారంభించిన రాష్ట్ర ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్ మట్లాడుతూ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ జోక్యం కారణంగానే రబ్బరు రైతులకు స్థిరమైన ధరలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ విధానాల కారణంగానే చిన్నకారు రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ తెలిపారు. దశాబ్దం క్రితం రూ.240గా ఉన్న కిలో రబ్బరు ధర ఇప్పుడు రూ.120కి పడిపోయిందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల తప్పుడు విధానాలే ఈ దుస్థితికి కారణమని చెప్పారు. పరిశ్రమను తిరిగి గాడిలో పెట్టేందుకు విధానపరమైన మార్పులు తీసుకురావాలని సెమినార్ సూచించింది.

యుపిలో వర్షాలతో 19 మంది మృతి

లక్నో: భారీ వర్షాలతో ఉత్తరప్రదేశ్‌లో 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్టేట్ రిలీఫ్ కమిషనర్ కార్యాలయం సోమవారం సాయంత్రం తెలిపింది. వీరిలో నలుగురు పిడుగుపాటు వల్ల మరణించారని, మరో ఇద్దరు నీటమునిగి మరణించారని పేర్కొంది. హర్దోయ్‌లో నలుగురు, బారాబంకిలో ముగ్గురు, ప్రతాప్‌గఢ్, కన్నౌజ్‌లో ఇద్దరు చొప్పున, అమేథి, డియోరియా, జలౌన్, కాన్పూర్, ఉన్నావ్, సంభాల్, రాంపూర్, ముజఫర్‌నగర్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని మధ్యప్రాంతంలో ఆదివారం నుంచి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. 22 జిల్లాల్లో గత 24 గంటల్లో 40 మిల్లీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అనేక ప్రదేశాలు నీట మునిగాయి. రోడ్లు జలమయమయ్యాయి. పట్టాలపైకి నీరు చేరడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నెల 17 వరకూ రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

రైతన్నకు నష్టం

- అమెరికన్ యాపిల్స్‌పై దిగుమతి సుంకం కోత వద్దు
- తప్పుబట్టిన రైతు సంఘాలు

న్యూఢిల్లీ: భారత్‌లో జీ20 సదస్సు కోసం అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ పర్యటనకు ముందు అమెరికా బాదం, యాపిల్స్, వాల్‌నట్‌లు, పప్పులపై దిగుమతి సుంకాలు తగ్గించిన అంశంపై రైతు సంఘాలు తీవ్రంగా స్పందించాయి. కేంద్రం నిర్ణయం ప్రకారం.. వాషింగ్టన్ యాపిల్స్‌పై దిగుమతి సుంకాలను 35 శాతం నుంచి 15 శాతానికి తగ్గింది. కనీస మద్దతుపై కొనుగోళ్లు లేకపోవడంతో ఇప్పటికే వాతావరణ మార్పు, బహిరంగ మార్కెట్‌లో దోపిడీ ధరల కష్టాలతో పోరాడుతున్న తరుణంలో యాపిల్స్, మసూర్ పప్పుపై దిగుమతి సుంకాలు తగ్గించడం వారి జీవితాలపై విపత్కర ప్రభావాన్ని చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. "వాతావరణం అనుకూలంగా ఉంటే నేను కొంత లాభం పొందవచ్చు. గత సీజన్‌లో క్వింటాల్‌కు రూ.3,200 చొప్పున విక్రయించాను. ఇక్కడ ఎంఎస్‌పీ సేకరణ లేదు. ధరలు మరింత తగ్గితే మనం ఎలా బతకాలి?" అని మధ్యప్రదేశ్‌కు చెందిన రైతు సురేంద్ర సింగ్ వాపోయారు. యాపిల్ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సోహన్ ఠాకూర్ మాట్లాడుతూ.. దిగుమతి సుంకం తగ్గింపు యొక్క తక్షణ ప్రభావం భారత మార్కెట్లో చౌకైన వాషింగ్టన్ ఆపిల్‌లను డంప్ చేయడానికి దారితీస్తుందని అన్నారు. "భారత మార్కెట్‌లో దాదాపు రూ. 6,000 కోట్ల వరకు యాపిల్స్‌ను డంప్ చేస్తారని మా అంచనా. హిమాచల్ ప్రదేశ్ రైతులు ప్రతి సంవత్సరం ఇంత విలువైన యాపిల్స్‌ను ఉత్పత్తి చేస్తారు"అని ఆయన అన్నారు. వాషింగ్టన్ యాపిల్ పెంపకందారులు అసాధారణమైన రాయితీలను పొందుతారని ఠాకూర్ అభిప్రాయపడ్డారు. అమెరికన్ యాపిల్ పెంపకందారులు తక్కువ ధరలకు ఉత్పత్తులను విక్రయించటమూ మంచి లాభాలను ఆర్జించడానికి ప్రధాన కారణమని తెలిపారు. "అమెరికన్ యాపిల్ పెంపకందారులు ఫెడరల్, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 32 శాతం రాయితీలను పొందుతున్నారని డేటా సూచిస్తున్నది. అయితే భారతీయ యాపిల్ పెంపకందారులు వరుసగా ప్రభుత్వాల ఉదాసీనతను నిరంతరం చూస్తున్నారు. 1991లో మేము ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు వంటి వివిధ విషయాలపై మొత్తం 9 శాతం సబ్సిడీలను పొందాము. ఇది 2023లో 2.5 శాతానికి తగ్గింది" అని ఠాకూర్ అన్నారు. భారతదేశంలో 10 లక్షల కుటుంబాలు తమ తోటల్లో యాపిల్ పండిస్తున్నాయని ఠాకూర్ చెప్పారు. హిమాచల్ ప్రదేశ్‌లో మూడు లక్షల కుటుంబాలు, జమ్మూ కాశ్మీర్‌లో ఏడు లక్షల కుటుంబాలు యాపిల్ సాగుపై ఆధారపడి ఉన్నాయని ఆయన చెప్పారు. యునైటెడ్ స్టేట్స్‌లోని వార్తా కథనాలను నిశితంగా పరిశీలిస్తే.. కేవలం 1,400 మంది యాపిల్ పెంపకందారులు మాత్రమే భారతదేశం నుంచి వ్యాపార భాగాన్ని తీసుకుంటారని సూచిస్తున్నారు.

క్రికెటర్ రవణిని ప్రోత్సహిస్తాం

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 ("సర్ఫేసీ యాక్ట్") క్రింద ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ కు ఛార్జ్ చేయబడిన స్థిరాస్తి యొక్క ప్రైవేట్ ఒప్పందం ద్వారా అమ్మకం.

దిగువసంతకందారు అయిన ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకపై "ఎబిహెచ్ఎఫ్ఎల్"గా సూచించబడుతుంది) కృష్ణాజిల్లా, జిల్లా రిజిస్ట్రార్ (తూర్పు), ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్, ఉయ్యూరు మండలం, నగర పంచాయతీ, ఉయ్యూరు, ఆర్.ఎస్.నం.లు.648, 993, 649 లో కుదించబడిన బేరింగ్ ప్లాట్ నం.లు. 139, 140, 145 మరియు 146 వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్

తేది: 12.09.2023
ప్రదేశం: విజయవాడ
అధీకృత అధికారి, ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి

చెన్నై : తమిళనాడులోని తిరుపత్తూరులో బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. మరో పది మంది గాయపడ్డారు. మృతులు కర్ణాటక యాత్రకు వెళ్లి తిరిగి వస్తున్న బృందంలోని సభ్యులు. మినీ బస్సు టైరు పగిలిపోవడంతో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశారు. ప్రయాణికులను దిగమని చెప్పి డ్రైవర్ మరమ్మతులు చేస్తున్నారు. ఆ సమయంలో వేగంగా వచ్చిన లారీ మినీ బస్సును ఢీకొట్టింది. దీంతో, బస్సు బోల్తా పడింది. బస్సులో ముందున్న సెల్వి, మీరా, దేవకి, కళావతి, సావిత్రి, గీతాంజలి, దేవనాయ్ మరణించారు. గాయపడిన వారిని ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.లక్ష, క్షతగాత్రులకు రూ.50వేలు ఆర్థికసాయం అందించినట్లు మంత్రి తెలిపారు.

భర్తే హంతకుడు

- సుప్రీం న్యాయవాది హత్య కేసులో వీడిన మిస్టరీ

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు న్యాయవాది రేణు సిన్హా అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ వీడింది. ఆమె భర్త నితిన్ నాథ్ సిన్హానే రేణును హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. రేణు సిన్హా తన భర్త నితిన్ నాథ్ సిన్హాతో కలిసి నోయిడా సెక్టార్ 30లోని బంగ్లాలో నివాసం ఉంటున్నారు. రేణు ఫోన్ తీయకపోవడంతో ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రేణు బంగ్లాలో శనివారం వెతకగా.. బాత్రూమ్‌లో ఆమె మృతదేహం కనిపించింది. ఆ బంగ్లా స్టోర్ రూమ్‌లో 36 గంటలుగా దాక్కుని వున్న నితిన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నితిన్ బంగ్లాను విక్రయించి, కొనుగోలుదారుడి నుంచి నగదు తీసుకున్నాడని పోలీసులు చెప్పారు. రేణు సిన్హా బంగ్లా విక్రయించేందుకు సిద్ధంగా లేకపోవడంతో నితిన్ హత్య చేశాడని తెలిపారు.

నకిలీ చెక్‌తో బిజెపి నేత భూకబ్జా

- రైలుకు ఎదురెళ్లి రైతు ఆత్మహత్య

లక్నో : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో కొందరు బిజెపి నేతలు భూకబ్జాలకు పాల్పడుతూ రైతుల ప్రాణాలను బలిగొంటున్నారు. తాజాగా ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. బిజెపి నాయకుడు భూకబ్జా చేయడం వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆ రైతు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. కాన్పూర్ జిల్లా చకేరి గ్రామానికి చెందిన బాబు సింగ్ యాదవ్ తనకున్న పొలంలో పంటలు పండిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. యాదవ్‌కున్న 6.5 బిగాల భూమిని బిజెపి నాయకుడు దివాకర్ కబ్జా చేశాడు. దీంతో కుటుంబాన్ని పోషించడం యాదవ్‌కు ఇబ్బందిగా మారింది. దిక్కుతోచని స్థితిలో వేగంగా వస్తున్న రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. యాదవ్ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టానికి తరలించారు. ఘటనాస్థలిలో సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. తన పేరిట ఉన్న 6.5 బిగాల అగ్రికల్చర్ ల్యాండ్‌కు రూ.6.29 కోట్ల నకిలీ చెక్కులు ఇచ్చి, దివాకర్ బలవంతంగా కబ్జా చేశాడని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను కట్టడి చేయాలని సిఎం యోగిని అభ్యర్థించారు. మీ సొంత పార్టీ నాయకులే రూల్స్‌ను బ్రేక్ చేస్తున్నారని తెలిపారు. వీలైతే తన పిల్లలకు న్యాయం చేయాలని యోగిని ఆ రైతు కోరారు.

దేశ సమస్యలపై దృష్టిపెట్టండి : ఖర్గే

న్యూఢిల్లీ: జి-20 సమావేశాలు ముగిసాయని, ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం దేశ సమస్యలపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. సోమవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేస్తూ.., '2024లో మోడీ ప్రభుత్వం నిష్క్రమణకు ప్రజలు మార్గం సుగమం చేయడం ప్రారంభించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం గురించి కూడా ప్రస్తావించారు. "ఆగస్టులో సాధారణ ప్లేట్ ఫుడ్ ధర 24 శాతం పెరిగింది" అని ఎక్స్‌లో రాసుకొచ్చారు. దేశంలో నిరుద్యోగం 8 శాతానికి చేరుకుందని.. యువత భవిష్యత్తు అంధకారమైందని తెలిపారు. మోడీ ప్రభుత్వ దుష్పరిపాలన వల్ల అవినీతి వెల్లువలా వచ్చిందని ఖర్గే ఆరోపించారు. కాగ్ అనేక నివేదికల్లో బిజెపిని బట్టబయలు చేసిందని.. జమ్మూకాశ్మీర్‌లో రూ.13000 కోట్ల జల్‌జీవన్ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. అవినీతిని బయటపెట్టినందుకు దళిత ఐఎఎస్ అధికారిపై వేధింపులు జరిగాయని ఖర్గే పేర్కొన్నారు. ప్రధాని ప్రాణ స్నేహితుడి దోపిడీ ఇటీవల మళ్లీ తెరపైకి వచ్చిందన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఆర్‌బిఐ ఖజానా నుంచి రూ.3 లక్షల కోట్లను మోడీ ప్రభుత్వానికి బదిలీ చేయాలన్న ప్రభుత్వ ఒత్తిడిని ఆర్‌బిఐ మాజీ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య వ్యతిరేకించారని, ఈ బండారం ఇటీవల బయటపడిందని చెప్పారు.

ముందస్తు అనుమతి అక్కర్లేదు

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద స్థాయిలో ఉన్నాసరే, వారిని అరెస్టు చేయడానికి, శిక్షించడానికి అవినీతి నిరోధక చట్టం-1988ను కచ్చితంగా అనుసరించాలి. సదరు ప్రభుత్వ ఉద్యోగి హోదా లేదా స్థితి కారణంగా ఆ వ్యక్తికి ఎటువంటి మినహాయింపు ఇవ్వడం సరికాదు. వారు అందరిలాగే నేరం చేసినందున అవినీతి అధికారులను రెండు కేటగిరీలుగా విభజించరాదు. అలా చేయడం 1988 అవినీతి నిరోధకచట్ట లక్ష్యాలకే విరుద్ధం. వీరి విషయంలోనూ సాధారణ విచారణ, దర్యాప్తు క్రమాన్ని అనుసరించాలని 2014 తీర్పులో సుప్రీం పేర్కొంది. సెక్షన్-6ఎ అవినీతి పరులైన సీనియర్ బ్యూరోక్రాట్లను గుర్తించేందుకు ఆటంకం కల్పిస్తోంది. ఇది వారికి ఒక రక్షణ కవచంగా ఉంది అని సుప్రీం ధర్మాసనం ముక్తాయింపు ఇచ్చింది.

అసమానతలకు పరిష్కారమేది?

- కీలక అంశాల ప్రస్తావనే లేదు
- జి-20 డిక్లరేషన్‌పై ప్రశ్నించిన పౌర సమాజం

న్యూఢిల్లీ : జి-20 సదస్సు ఆమోదించిన డిక్లరేషన్‌లో కీలకమైన అంతర్జాతీయ అంశాల ప్రస్తావన లేకపోవడాన్ని పౌర సమాజ సంస్థలు ప్రశ్నించాయి. తీవ్ర ఆందోళన కలిగిస్తున్న ఆర్థిక అసమానతలు, వాతావరణ సంక్షోభం, ఆకలి, ఇంధనం వంటి కీలక సమస్యల పరిష్కారానికి సదస్సు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించలేకపోయిందని పేర్కొన్నాయి. పౌర సమాజ సంస్థలు, వాటి నేతలతో కూడిన అంతర్జాతీయ సంస్థ 'పీపుల్స్ 20' ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పౌర సమాజం ప్రాధాన్యత తగ్గిపోవడం, ప్రపంచంలోని పలు దేశాలలో ప్రజాస్వామ్యం బలహీనపడడంపై ఆ ప్రకటన ఆందోళన వ్యక్తం చేసింది. సౌదీ అరేబియా, రష్యా, తుర్కియే, మెక్సికో, భారత్ సహా పలు జీ-20 దేశాలలో ఈ పరిస్థితి కన్పిస్తోందని తెలిపింది.

'జి-20 సదస్సు సందర్భంగా సుందరీకరణ పేరుతో దేశ రాజధానిలోని అనేక మురికివాడలను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. దీంతో వేలాది మంది పేదలు నిరాశ్రయులయ్యారు. పౌర సమాజ సంస్థల సమావేశాలను కూడా అడ్డుకున్నారు. సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయంతో డిక్లరేషన్‌ను రూపొందించినందుకు భారత ప్రభుత్వానికి అభినందనలు. కానీ, 14,000 పదాలకు పైగా ఉన్న ఈ డిక్లరేషన్ ప్రపంచ దేశాలను వెంటాడుతున్న సంక్షోభాలపై విశ్లేషణ జరిపి, పరిష్కారాలను సూచించలేకపోయింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ, పర్యావరణ సంబంధమైన అసమానతలు, జీవ వైవిధ్యానికి ఎదురవుతున్న ముప్పు వంటి అంశాలపై డిక్లరేషన్ స్పష్టత ఇవ్వలేదు. నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలను, జిడిపి కేంద్రీకృత అభివృద్ధి నమూనాను అంచనా వేయడంలో సదస్సు విఫలమైంది. ముదురుతున్న అంతర్జాతీయ సంక్షోభాన్ని పట్టించుకోలేదు. డిక్లరేషన్‌పై జాప్యం అనేక అనుమానాలకు తావిస్తోంది. డిక్లరేషన్ అమలు కోసం నిర్దిష్టమైన, కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక ఏదీ లేదు. స్వతంత్ర జవాబుదారీతనం కానీ, పర్యవేక్షణ యంత్రాంగం కానీ లేవు' అని పీపుల్స్ 20 సంస్థ ఆ ప్రకటనలో విమర్శించింది.

ఆర్థికాభివృద్ధిలో ప్రైవేటు రంగం పాత్రపై జి-20 సదస్సు అనవసరమైన దృష్టి సారించిందని పీపుల్స్ 20 సంస్థ అభిప్రాయపడింది. దీనివల్ల ప్రభుత్వ విధానాల పైన, ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల పైన కార్పొరేట్ ప్రభావం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన 60 దేశాల రుణాలను రద్దు చేసే విషయంలో చొరవ చూపకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. పౌర సమాజ సంస్థల సిఫార్సులకు డిక్లరేషన్‌లో చోటు కల్పించకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. వివిధ దేశాలలో పెరుగుతున్న సైనిక వ్యయం, ఆయుధ వ్యాప్తి వంటి అంశాలపై సదస్సు దృష్టి సారించలేదని పీపుల్స్ 20 సంస్థ తెలిపింది.

సౌదీ యువరాజు సల్మాన్‌తో ప్రధాని మోడీ భేటీ

న్యూఢిల్లీ : భారత్ పర్యటనలో ఉన్న సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్‌తో సోమవారం ప్రధాని మోడీ భేటీ అయ్యారు. వాణిజ్య, ఆర్థిక, రక్షణ రంగాలతోపాటు సాంస్కృతిక సహకారం వంటి ప్రధాన అంశాలపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన వ్యూహాత్మక భాగస్వామ్య మండలి మొదటి సమావేశానికి ఇరువురు నేతలు అధ్యక్షత వహించారు. 2019లో రియాద్‌లో భారత్, సౌదీ అరేబియాల మధ్య జరిగిన సమావేశంలో ద్వైపాక్షిక ఒప్పందంపై ఇరు దేశాలు సంతకం చేసిన సంగతి తెలిసిందే. సౌదీ అరేబియా భారత్‌ను అత్యంత సన్నిహిత, వ్యూహాత్మక భాగస్వాములలో ఒకటిగా భావిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. ఆ ప్రాంత, ప్రపంచ సంక్షేమం, స్థిరత్వం కోసం ఇరుదేశాల భాగస్వామ్యం కీలకమని అన్నారు. నేటి సమావేశం తమ బంధానికి కొత్త కోణాన్ని ఇచ్చిందని, మానవజాతి కోసం పనిచేయడానికి స్ఫూర్తినిచ్చిందని అన్నారు. సౌదీ యువరాజు సల్మాన్ భారత్‌లో పర్యటించడం ఇది రెండోసారి.

ఉచిత సాఫ్ట్‌వేర్‌లో ఛాంపియన్

- అంతర్జాతీయ మోడల్‌గా స్కూల్ వికీ పోర్టల్
- ఇంటర్నెట్ కనెక్టివిటీలో ముందంజ
- కేరళపై యునెస్కో ప్రశంసలు

తిరువనంతపురం : కేరళ ఉచిత సాఫ్ట్‌వేర్‌లో ఛాంపియన్‌గా ఉందని, అంతర్జాతీయ మోడల్‌గా స్కూల్ వికీ పోర్టల్‌ను తీర్చిదిద్దిందని, దేశంలోనే ఇంటర్నెట్ కనెక్టివిటీలో ముందంజలో ఉందని యునెస్కో ప్రశంసల వర్షం కురిపించింది. యునెస్కో ప్రచురించిన 2023 గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ రిపోర్ట్ కేరళను ప్రశంసించింది. కేరళ విద్యా రంగంలో సాంకేతికతను అనుసంధానం చేసినందుకు ఈ గుర్తింపు లభించిందని ఆ రాష్ట్ర సాధారణ విద్యాశాఖ మంత్రి వి.శివంకుట్టి తెలిపారు. యునెస్కో నివేదికలో రాష్ట్ర విద్యా రంగంలో సాంకేతికత వినియోగం గురించి మూడు ప్రత్యేక ప్రస్తావనలు ఉన్నాయి. కైట్ నాయకత్వంలో పనిచేస్తున్న స్కూల్ వికీపోర్టల్ గురించి నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. 'నాణ్యత - కంటెంట్ సృష్టి యొక్క వైవిధ్యాన్ని కలిసికట్టుగా పనిచేయడం మెరుగుపరుస్తుంది' అనే శీర్షికతో స్కూల్ వికీపోర్టల్‌ను ఒక అంతర్జాతీయ మోడల్‌గా నివేదిక ప్రశంసించింది. ఉచిత సాఫ్ట్‌వేర్ వికీమీడియా ప్లాట్‌ఫారమ్‌పై అభివృద్ధి చేసిన స్కూల్ వికీపోర్టల్‌లో భాగస్వామ్య పద్ధతిలో 15,000 కంటే ఎక్కువ పాఠశాలల్లో కంటెంట్‌ను అభివృద్ధి చేయడం గొప్ప విజయం అని యునెస్కో నివేదిక పేర్కొంది. స్కూల్ వికీ (www.schoolwiki.in) పోర్టల్ అనేది భారతదేశ విద్యా రంగానికి సంబంధించి స్థానిక భాషలో అతిపెద్ద సమాచార రిపోజిటరీ. ఇందులో పాఠశాలలు, స్టేట్ స్కూల్ ఆర్ట్ ఫెస్టివల్ కంపోజిషన్‌లు, పెయింటింగ్‌లు, డిజిటల్ మ్యాగజైన్‌లు, కోవిడ్ కాలం నాటి కంపోజిషన్‌లకు సంబంధించిన సమాచారం ఉంటుంది. కేరళలోని పాఠశాలల్లో డిజిటల్ విద్య కోసం ఉచిత సాఫ్ట్‌వేర్‌లు మాత్రమే ఉపయోగించడాన్ని కూడా యునెస్కో ప్రత్యేకంగా పేర్కొంది. 'ఉచిత సాఫ్ట్‌వేర్‌లో కొన్ని దేశాలు ఛాంపియన్‌లుగా మారాయి' అనే శీర్షికతో దీనిని గురించి నివేదిక వివరించింది. కేరళ రాష్ట్ర ప్రభుత్వ ఉచిత సాఫ్ట్‌వేర్ విధానాన్ని ప్రముఖంగా పేర్కొంటూ... రాష్ట్రంలో వివిధ పాఠశాలల్లో సుమారు రెండు లక్షల ల్యాప్‌టాప్‌లు ఉచిత సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లతో పనిచేస్తున్నట్లు నివేదిక తెలిపింది.

డిజిటల్ ఎడ్యుకేషన్‌లో ఉచిత సాఫ్ట్‌వేర్ వినియోగంతో కేరళ ప్రభుత్వం రూ.3,000 కోట్లు ఆదా చేసిందనే వాస్తవాన్ని నీతి ఆయోగ్‌తో సహా అనేక సంస్థలు ఇప్పటికే గుర్తించాయి. యునెస్కో నివేదికలోని మూడవ ప్రస్తావన ప్రకారం పాఠశాల ల్లో అత్యధిక ఇంటర్నెట్ కనెక్టివిటీ విషయంలో దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే కేరళ ముందుంది.

వియత్నాం నేతలతో బైడెన్ భేటీ

సంబంధాల మెరుగుదలకు అంగీకారం

హనోయ్ : శాంతి, సహకారం, సుస్థిర అభివృద్ధి కోసం తమ సంబంధాలను మరింత మెరుగుపరచుకోవాలని వియత్నాం, అమెరికా అంగీకరించాయి. రెండు రోజుల అధికార పర్యటన నిమిత్తం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆదివారం హనోయ్ చేరుకున్నారు. అక్కడ వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నుగుయెన్ ఫూ ట్రాంగ్‌తో ఉన్నత స్థాయి చర్చలు జరిపారు. ఏళ్ళ తరబడి ఇరు దేశాల సంబంధాల్లో నెలకొన్న సానుకూల అభివృద్ధి పట్ల ఇరువురు నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. వియత్నాం - అమెరికా సంబంధా లను నిర్వచించే మార్గదర్శక సూత్రాలను పూర్తిగా గౌరవించా ల్సిన అవసరం వుందని వారు తెలిపారు. . ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి ఇది అత్యంత కీలకమైన అంశమని అన్నారు. ఐక్యరాజ్య సమితి నిబంధనావళిని, అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా ఇరు పక్షాలు గౌరవించా లని పేర్కొన్నారు. పరస్పర రాజకీయ వ్యవస్థలను, స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించుకో వాలన్నారు. గతాన్ని మరిచి, విభేదాలను అధిగ మిస్తూ, సారూపత్యలను పెంచి పోషించుకుంటూ, భవితవ్యం వైపు దృష్టి సారిస్తూ ముందుకు సాగాలని ఇరువురు నేతలు గుర్తు చేసుకున్నారు. బలమైన, స్వతంత్రతతో కూడిన, స్వావలంబన కలిగిన, సంపద్వంత మైన వియత్నాంను బైడెన్ అభినందించారు. పరస్పర అవగాహనను పెంచి పోషించుకోవాల్సిన అవసరం వుందని బైడెన్ పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలు, సహకారం పెరిగేలా పర్యటనలు, పరస్పరం మార్పిడులు పెరగాలని ఆయన అన్నారు. తూర్పు సముద్ర జలాలకు సంబంధించిన అంశాలపై వియత్నాం వైఖరిని, ఆసియాన్ వైఖరికి అమెరికా మద్దతివ్వడాన్ని ట్రాంగ్ అభినందించారు. శాంతి, భద్రత, సహకారాలకు అమెరికా మద్దతును కొనసాగించాలని కోరారు.

బిజెపి ఓ 'విషసర్పం' : ఉదయనిధి

చెన్నై : బిజెపి ఓ విషసర్పం అని డిఎంకె నేత, తమిళనాడు మంత్రి ఉదయనిధి విమర్శించారు. తమిళనాడులోని నైవేలీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆదివారం ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష అన్నాడిఎంకె పాములకు ఆశ్రయమిచ్చే పార్టీగా మారిందని తెలిపారు. "విష సర్పం మీ ఇంట్లోకి వస్తే.. దానిని తీసి బయట పడేస్తే కుదరదు. అది మీ ఇంటి చుట్టుపక్కల చెత్తలో దాక్కొంటుంది. ఆ చెత్తను తీసేసే వరకూ అది మీ ఇంట్లోకి వస్తూనే ఉంటుంది. ఈ సన్నివేశంతో ప్రస్తుత పరిస్థితి పోలిస్తే.. తమిళనాడు మన ఇల్లు. బిజెపి ఓ విష సర్పం. అన్నాడిఎంకె మన ఇంటి వద్ద ఉన్న చెత్తలాంటిది. మనం చెత్తను తీసే వరకు విష సర్పం దూరం కాదు. బిజెపి నుంచి విముక్తి పొందాలంటే.. అన్నాడిఎంకెను తొలగించాలి" అని ఉదయనిధి వ్యాఖ్యానించారు.

అలెండి ప్రభుత్వ కూల్చివేతకు 50 ఏళ్లు

- చిలీలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన అమెరికా

శాంటియాగో : సెప్టెంబరు11 అంటే చాలా మందికి గుర్తుకొచ్చేది అమెరికన్ ట్రేడ్ సెంటర్‌లోని జంట టవర్స్ కూల్చివేత ఘటన. కానీ, చిలీలో ప్రజాస్వామ్యాన్ని అమెరికా నిలువునా ఖూనీ చేసినది కూడా అదే రోజు అని ఎంతమందికి తెలుసు! 1973 సెప్టెంబరు11న ప్రపంచంలో తొలిసారిగా ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని అమెరికా సైనిక కుట్ర ద్వారా కూల్చివేసి, చిలీ సోషలిస్టు నేత సాల్వెడార్ అలెండిని హత్యగావించింది. ఆ ఘటనకు నేటితో 50 ఏళ్లు. ఆనాటి సైనిక కుట్రకు, అలెండి హత్యకు అమెరికా మద్దతు వుందని వెల్లడిస్తూ కొద్ది రోజుల క్రితమే ఒక నివేదిక వెలువడింది. ఆనాటి కుట్రలో ఆచూకీ తెలియకుండా పోయిన వారికోసం గాలింపు జరిపేందుకు ఇప్పటికే దేశవ్యాప్తంగా ఒక ప్రణాళికను అమలు చేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అలెండి ప్రభుత్వాన్ని అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు అమెరికా చాలా ప్రయత్నించింది. అందులో విజయం సాధించలేకపోయింది. 1973 సెప్టెంబరు 11న సైన్యం, జనరల్ అగస్టో పినొచెట్ సాయంతో ప్రభుత్వాన్ని కూలదోసింది. ఇక ఆ తర్వాత నుంచి 17ఏళ్ల పాటు పినొచెట్ నేతృత్వంలో అణచివేత పాలన సాగింది. అమెరికాతో పొత్తు పెట్టుకుంది. ఈ 17ఏళ్ల కాలంలో మూడు వేల మందికి పైగా గల్లంతయ్యారు. 38వేల మంది రాజకీయ ఖైదీలుగా మారారు. వారిలో చాలా మంది వేధింపుల బాధితులే. కుట్ర రోజున, అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థ సిఐఎ అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌కు పంపిన రిపోర్టును విడుదల చేశారు. 'గత మూడేళ్లుగా అధ్యక్షుడు, విదేశాంగ మంత్రి హెన్రీ కిసింజర్ ప్రోత్సహిస్తూ వచ్చిన సైనిక కుట్ర ఇప్పటికి విజయవంతంగా పూర్తయింది' అని ఆ నివేదిక పేర్కొంది.

9/11 దాడులకు 22 ఏళ్లు

- ఇంకా కొనసాగుతున్న మృతుల గుర్తింపు

వాషింగ్టన్ : అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి ఘటనకు సోమవారానికి 22 ఏళ్లు పూర్తయ్యాయి. 2001 సెప్టెంబర్ 11న హైజాక్ చేసిన అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానాలతో ట్విన్ టవర్స్‌ను అల్‌ఖైదా కూల్చివేసింది. ఆ రోజు ఉదయం 8:46 గంటలకు ఒక విమానం సెంటర్‌లోని నార్త్ టవర్‌పైనా, రెండో విమానం 9:03 గంటలకు సౌత్ టవర్‌పైనా దాడి చేశాయి. తరువాత మూడో విమానం ఉదయం 9:37 గంటలకు వర్జీనియాలోని పెంటగాన్ సమీపంలో ఆర్లింగ్టన్ వద్ద కూలిపోయింది. నాల్గో విమానం యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 93 తన గమ్యస్థానం చేరుకోకుండా ప్రయాణికులతో నిరోధించబడింది. ఈ 9/11 దాడుల్లో మూడు వేల మందికిపైగా చనిపోయారు. ఈ దాడికి ఒసామా బిన్ లాడెన్ ప్రధాన సూత్రధారి అని అమెరికా ప్రకటించింది. 2011 మే 2న పాకిస్తాన్‌లోని అబొత్తాబాద్‌లో తలదాచుకున్న బిన్ లాడెన్‌ను హతమార్చింది.

9/11 దాడుల్లో మరణించిన వారందరి గుర్తింపు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ దాడుల్లో మూడు వేల మందికిపైగా మరణించారని భావిస్తుండగా, ఇప్పటివరకు 1649 మందినే గుర్తించారు.

సాయం కోసం ఎదురుచూపులు

- 2,100కి పెరిగిన మొరాకో భూకంప మృతులు

రబట్ : మొరాకో భూకంప బాధితులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. తాగునీరు, ఆహారం, తలదాచుకునే చోటు లేక నానా ఇబ్బందులుపడుతున్నారు. ఈ నెల 8వ తేదీ రాత్రి సంభవించిన భూకంపంలో మరణించిన వారి సంఖ్య 2,100 దాటింది. మరో 2,400మందికి పైగా గాయపడ్డారు. గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతుండడంతో మరణించిన వారి సంఖ్య పెరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ఈ ప్రకృతి వైపరీత్యం నుండి బయటపడిన వారు ఆహారం, నీరు, ఆశ్రయం, సాయం కోసం ఎదురు చూస్తున్నారు. చాలామంది ఇప్పటికీ రాత్రుళ్లు ఆరుబయటనే గడుపుతున్నారు. ఎక్కడికక్కడ రోడ్లు తెగిపోయి శిథిలాల గుట్టగా మారడంతో, భూకంపానికి గురైన మారుమూల ప్రాంతాలు, గ్రామాలకు సహాయక సిబ్బంది వెళ్లడం సవాళ్లతో కూడినదిగా వుంది. ఇతర దేశాల నుంచి అందే సాయాన్ని స్వీకరిస్తామని, తమకు అవసరమైనట్లుగా వాటిని సమన్వయం చేసుకుంటామని మొరాకో ప్రభుత్వం తెలిపింది.

మొరాకో సాంస్కృతిక వారసత్వానికి కూడా గణనీయంగా నష్టం వాటిల్లింది. 12వ శతాబ్దానికి చెందిన మసీదు కుప్పకూలిందని స్థానిక మీడియా తెలిపింది. యునెస్కో వారసత్వ సంపదగా ప్రకటించిన మరకేష్ పాత బస్తీలోని పలు ప్రాంతాలు ధ్వంసమయ్యాయి. 1960ల్లో వచ్చిన తీవ్ర భూకంపంలో దాదాపు 12వేల మంది చనిపోయారు.

ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే ఇంత తీవ్రమైన భూకంపం నమోదైంది. స్పెయిన్, బ్రిటన్, కతార్, అమెరికా వంటి దేశాలు ఇప్పటికే సహాయక బృందాలను పంపించాయి. మూడు లక్షల మంది ఈ ప్రకృతి వైపరీత్యానికి ప్రభావితులయ్యారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. మూడు రోజుల పాటు మొరాకోలో జాతీయ సంతాప దినాలు పాటిస్తున్నారు.

సైన్యం ఆహ్వానం మేరకే మణిపూర్ పర్యటన

- ఢిల్లీ హైకోర్టులో విచారించాలి
- ఎడిటర్స్ గిల్డ్ పిటిషన్‌పై 15న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : ప్రాంతీయ మీడియా 'అనైతిక, పరోక్ష రిపోర్టింగ్'ను నిష్పక్షపాతంగా సమీక్షించడానికి సైన్యం సూచనపై తమ బృందం మణిపూర్‌లో పర్యటించిందని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఇజిఐ) సోమవారం సుప్రీం కోర్టుకు తెలిపింది. "మా అంతట మేముగా అక్కడకు వెళ్లలేదు. అక్కడ పర్యటించాల్సిందిగా సైన్యం మమ్మల్ని ఆహ్వానించింది. సైన్యం నుంచి మాకు లేఖ అందింది." అని ఇజిఐ తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ ముందు ఇజిఐ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తన వాదనలు వినిపించారు. ఎడిటర్స్ గిల్డ్ మణిపూర్ వెళ్లాలని సైన్యం ఎందుకు కోరుకుంది? అంటూ ప్రధాన న్యాయమూర్తి విస్మయం వ్యక్తం చేశారు. "క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతోందో నిష్పక్షపాతంగా అంచనా వేయాల్సిందిగా వారు మమ్మల్ని కోరారు. మేం మా నివేదికను ఈ నెల 2న ప్రచురించాం. ఈ నెల 3వ తేదీ రాత్రి ఐపిసి కింద నమోదైన నేరాలకు మమ్మల్ని ప్రాసిక్యూట్ చేశారు. ముఖ్యమంత్రి కూడా మాకు వ్యతిరేకంగా ప్రకటన చేశారు. ఒక నివేదికను ప్రచురించినందుకు మమ్మల్ని ఎలా ప్రాసిక్యూట్ చేస్తారు?" అని సిబల్ కోర్టును ప్రశ్నించారు. "ఎడిటర్స్ గిల్డ్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎఫ్‌ఐఆర్ నమోదైన కేసు ఇది. వారి అభిప్రాయం తెలియజేస్తూ నివేదికను మాత్రమే ఇచ్చారు. అంతేకానీ వారు నేరం చేయలేదు." అంటూ మణిపూర్ ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ స్పష్టం చేశారు.

ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయాలని కోరుతూ మణిపూర్ హైకోర్టుకు బదులుగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించడానికి ఇజిఐని అనుమతించాలని సిబల్ చేసిన అభ్యర్థనను పరిశీలించాలని కూడా ప్రధాన న్యాయమూర్తి నిర్ణయించారు. దీనిపై ఈ నెల 15న విచారణకు కేసును వాయిదా వేశారు. ఆలోగా జర్నలిస్టులను అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలంటూ ఈ నెల 6న ఇచ్చిన ఉత్తర్వులను పొడిగించారు. ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయలేం కానీ ఢిల్లీ హైకోర్టు విచారించాలన్న పిటిషన్‌ను పరిశీలిస్తామని చంద్రచూడ్ చెప్పారు.

కర్ణాటకలో డెంగీ విజృంభణ

- 7 వేలకు పైగా కేసులు
- బెంగళూరులోనే 4 వేలు

బెంగళూరు : కర్ణాటకలో డెంగీ విజృంభిస్తోంది. గత కొన్ని రోజుల్లోనే రాష్ట్రంలో ఏడు వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. రాజధాని బెంగళూరులోనే 4 వేల కేసులు నమోదయ్యాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వయంగా తన ఫేస్‌బుక్ పేజీ ద్వారా వెల్లడించారు. 'డెంగీ వేగంగా వ్యాప్తి చెందడంపై సంబంధిత శాఖ అధికారులతో చర్చించి, అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వారికి సూచించాను. బెంగళూరు నగర పరిధిలో, దోమల నివారణకు మందులు పిచికారీ చేయడం, నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించడం, వాటిని శుభ్రపరచడం వంటి సమర్థవంతమైన చర్యలు కొనసాగుతున్నాయి' అని సిద్ధరామయ్య తెలిపారు. 'ఇంటి పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, దోమల బెడదపై జాగ్రత్తగా ఉండాలని నేను ప్రజలను కోరుతున్నాను, డెంగీ గురించి భయపడవద్దు, అప్రమత్తంగా ఉండండి' అని సిఎం పేర్కొన్నారు.

మహారాష్ట్రలో మత ఘర్షణలు

- ఒకరి మృతి, ఎనిమిది మందికి తీవ్రగాయాలు
- అనేక ఇళ్లు దగ్ధం

ముంబయి : మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఒక గ్రామంలో మత ఘర్షణలు చెలరేగి ఒకరు మృతి చెందగా, 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఖతౌ తాలుకాలోని పుసేసావాలి గ్రామంలో ఆదివారం రాత్రి ఈ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. సోషల్ మీడియాలో ఒక అభ్యంతరకరమైన పోస్టు పెట్టిన తరువాత ఈ ఘర్షణలు ప్రారంభమైనట్లు పోలీసులు సోమవారం వెల్లడించారు. సోషల్ మీడియాలో పోస్టు తరువాత గ్రామంలో అనేక ఇళ్లను దుండగులు తగులపెట్టారని, దీంతో రెండు గ్రూపుల మధ్య వాగ్వాదం, ఘర్షణలు ప్రారంభమయ్యాయని పోలీసులు చెప్పారు. ప్రత్యక్ష సాక్షులు వెల్లడించిన వివరాల ప్రకారం సుమారు వెయ్యి మందితో ఉన్న ఒక దుండగుల గుంపు ఒక నిర్దిష్ట ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడింది. ఇళ్లు, వ్యాపార సంస్థలను తగులబెట్టారు. అడ్డువచ్చిన వారిపై భౌతిక హింసకు పాల్పడింది. ఈ ఘర్షణలకు సంబంధించి పోలీసులు ఇప్పటి వరకూ 25 మందిని అరెస్టు చేశారు. ఇందులో ఇద్దర్ని అభ్యంతరకరమైన పోస్టులు పెట్టినందుకు, మిగిలిన 23 మందిని హత్య, అల్లర్లు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకు అరెస్టు చేశారు. అలాగే ముందుజాగ్రత్త చర్యగా జిల్లావ్యాప్తంగా బుధవారం ఉదయం వరకూ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. సెక్షన్ 144 కూడా విధించినట్లు సతారా జిల్లా కలెక్టర్ జితేంద్ర దుడి తెలిపారు.

బాబు అరెస్టు కక్షసాధింపులా ఉంది : మమత

కోల్‌కతా: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కక్ష సాధింపులా ఉందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. సోమవారం ఆమె స్థానిక మీడియాతో మాట్లాడారు. టిడిపి హయాంలో ఏదైనా తప్పు జరిగితే మాట్లాడాలని, పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని అన్నారు. కానీ కక్షపూరితంగా ప్రవర్తించడం సరికాదని మమతా బెనర్జీ తెలిపారు. ఈరోజు ఒక ప్రభుత్వం అధికారంలో ఉంది, రేపు మరో ప్రభుత్వం అధికారంలోకి వస్తే కూడా అదే పని చేస్తుందని, ఏదైనా తప్పు జరిగితే గమనించి విచారణ చేయండి కానీ ప్రతీకారంతో ఏమీ చేయవద్దని మమతా బెనర్జీ అన్నారు.

భౌగోళిక రాజకీయాలకు జి-20 వేదిక కాదు : చైనా

చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్

న్యూఢిల్లీ : న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను చైనా సోమవారం స్వాగతించింది. జి-20 అనేది ఆర్థిక సహకారానికి సంబంధించిన వేదిక, అంతేగానీ భౌగోళిక, రాజకీయ, భద్రతా సమస్యలను పరిష్కరించేందుకు ఒక వేదిక కాదని పేర్కొంటున్న న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను స్వాగతిస్తున్నట్లు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. శనివారం ప్రకటించిన బృహత్తర ప్రాజెక్టు భారత్-మధ్య ప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ (ఐఎంఇసి)ను కూడా చైనా స్వాగతించింది. ఇది భౌగోళిక, రాజకీయ సాధనంగా మారరాదని సూచించింది. "వర్ధమాన దేశాలు మౌలిక సదుపాయాలను నిర్మించుకునేందుకు వాస్తవంగా సాయపడే, అనుసంధానతను, ఉమ్మడి అభివృద్ధిని పెంచి పోషించే అన్ని చొరవలనూ చైనా స్వాగతిస్తుంది." అని చైనా విదేశాంగ శాఖ ఆ ప్రకటనలో పేర్కొంది. అదే సమయంలో ఇటువంటి వివిధ అనుసంధాన చొరవలనేవి పారదర్శకంగా, అందరినీ కలుపుకుని పోయేలా వుండాలి తప్పితే భౌగోళిక, రాజకీయ సమస్యలను పరిష్కరించుకునే సాధనాలుగా మారరాదని సూచించింది. జి-20 సభ్య దేశాల ఉమ్మడి అవగాహనను ప్రతిబింబించేలా, చర్చల ద్వారా సాధించిన ఏకాభిప్రాయాన్ని ప్రదర్శించేలా జి-20 నేతల డిక్లరేషన్ వుందని పేర్కొంది. అంతర్జాతీయ ఆర్థిక సహకారానికి సంబంధించిన ప్రధాన వేదికగానే జి-20 వుండాలి కానీ భౌగోళిక, రాజకీయ, భద్రతాపరమైన సమస్యలను పరిష్కరించుకునే సాధనంగా మారరాదని మావో పేర్కొన్నారు. ఉక్రెయిన్ సంక్షోభానికి రాజకీయ పరిష్కారం కోసం అంతర్జాతీయ సమాజంలో కలిసి పని చేయడానికి, శాంతి చర్చలు పెంపొందించడానికి చైనా ఎప్పుడూ కట్టుబడి వుంటుందని చెప్పారు.

ప్రైవేట్ వాహన యజమానుల సమ్మె విరమణ

బెంగళూరు : కర్ణాటకలో సోమవారం ప్రైవేట్ వాహన యజమానులు నిర్వహించ తలపెట్టిన ఒక రోజు సమ్మెను మధ్యాహ్నానికే విరమించారు. వాహన యజమానుల సమస్యలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దృష్టికి తీసుకెళ్తామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి ఇచ్చిన హామీ మేరకు యజమానులు ఈ సమ్మెను విరమించారు. 36 ప్రైవేట్ వాహన యజమానుల సంఘాలతో ఏర్పడిన ఫెడరేషన్ సమ్మెకు పిలుపునిచ్చింది. ఫ్రీడం పార్క్ వద్ద ఆందోళన చేస్తున్న వాహన యజమానుల వద్దకు మంత్రి రామలింగ రెడ్డి చేరుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. ఇలాంటి ప్రైవేట్ వాహన యజమానుల కోసం ఒక కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆటోలు, ట్యాక్సీలు, ఎయిర్‌పోర్ట్ ట్యాక్సీలు, మిక్సి క్యాబ్స్, సరుకు రవాణా వాహనాలు, పాఠశాలల వాహనాలు, స్టేజ్ క్యారియర్లు, కాంట్రాక్ట్ క్యారియర్లు వంటి ప్రైవేట్ వాహన యజమానులు ఈ పాల్గొన్నారు.

మీకోసం

తులసి ఆకులు నీళ్లలో వేసుకొని ప్రతిరోజూ తాగుతుంటే గొంతు ఇన్ఫెక్షన్ తగ్గుతుంది.

జీవన సౌరభం

విజయం కోసం ప్రయత్నించడమే జీవితం కాకూడదు. విలువల కోసం జీవించడమే జీవిత లక్ష్యం కావాలి.

నడవరా ముందుగా ...



'అమ్మా.. ఈ రోజు క్లాసులో ఏం జరిగిందో తెలుసా' అంటూ భుజాన వున్న బ్యాగ్ సోఫా మీద పడేశాడు శ్రీయాన్. 'ఏం జరిగింది' అంటూ వివరాలు అడిగింది తల్లి శిరీష. 'ప్లాస్టిక్ వినియోగం, దాని వల్ల జరిగే అపకారం అన్నీ వివరించి చెప్పారు. మనం వాడి పారేసే ప్లాస్టిక్ సంచులు, కవర్లు ఎంతో హాని కలిగిస్తాయట. ఇక నుంచి ఎవరూ ప్లాస్టిక్ సంచులు, కవర్లు వాడకూడదని అందరి చేత ప్రామిస్ చేయించారు' అంటూ స్కూల్లో జరిగిన విషయాన్ని చెప్పాడు శ్రీయాన్.

'అవును ఇది నిజమే. ప్లాస్టిక్ వినియోగం ఇప్పుడు బాగా పెరిగిపోయింది. మనం పారేసిన ప్లాస్టిక్ తిని జంతువులు, పక్షులు కూడా చనిపోతున్నాయి. ఈ ప్లాస్టిక్ ఎప్పటికీ భూమిలో కలసి పోదు. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలసి పోవడం వల్ల ఏడాదికి 20 లక్షల పక్షులు, చేపలు చనిపోతున్నాయని ఓ అంచనా." అంటూ తనకు తెలిసిన విషయాలు చెప్పింది శిరీష.

'మరి దీనికి మనం ఏమి చేయలేమా అమ్మా' అన్నాడు శ్రీయాన్.

'ఎందుకు చేయలేము మీరు స్కూల్లో ప్రామిస్ చేసినట్టుగా ఈ రోజు నుండి ప్లాస్టిక్ కవర్స్, ప్లాస్టిక్ వస్తువులు మన ఇంట్లో వాడడం మానేద్దాం. మనకు తెలిసిన వాళ్ళందరికీ వాటి వల్ల కలిగే చెడుని చెబుదాం. వారిచేత కూడా వాటి వాడకం మానేలా చూద్దాం. ఇలా మనం మొదలు పెడితే కచ్చితంగా అందరూ మన బాటన నడుస్తారు. అప్పుడు తప్పక మార్పు వస్తుంది' అంది శిరీష.

'ఇలాంటి పనులు చెప్పడం కన్నా ఆచరించడం గొప్పది. మనం ఆచరించకుండా ఎదుటి వారిని చేయమనడం వల్ల ఫలితం వుండదు. కాబట్టి ముందుగా మన ఇంట్లో వున్న ప్లాస్టిక్ పాత్రలు, కవర్స్ తీసేయండి' అంటూ అప్పుడే లోపలికి వస్తున్న శ్రీయాన్ తండ్రి శ్రీధర్ అన్నాడు, నవ్వుతూ.

ఆ రోజు నుండి శ్రీయాన్ ఇంట్లో ప్లాస్టిక్ వస్తువులు వాడడం మానేశారు. స్కూల్‌లో శ్రీయాన్ ఓ బృందాన్ని ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వినియోగం, హానిపై అవగాహన కల్పించాడు. కొన్ని రోజులకే ఒక్కొక్కరిగా ప్లాస్టిక్ వస్తువులను నిషేధించడం మొదలుపెట్టారు.

- కూచిమంచి నాగేంద్ర,
91821 27880.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరుసగా కలిపితే అందమైన కుక్కపిల్ల బొమ్మ వస్తుంది. ట్రై చేయండి మరి!

నేను గీసిన బొమ్మ

-హనీఫా షాజియా,
3వ తరగతి,
కొమ్మారెడ్డి స్కూలు,
బంటుమిల్లి,
కృష్ణా జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆసరా లేని బతుకులు

'మా ఇల్లు ఎలా ఉంది? అసలు ఉందా.. లేదా? ఎవరైనా కూల్చేశారా? ఇంట్లో వస్తువులన్నీ ఉన్నాయా.. లేవా? గ్రామానికి ఎవరైనా వచ్చారా?' అంటూ పునరావాస కేంద్రాలకు వెళ్తున్న మీడియా రిపోర్టర్లను మణిపూర్ అల్లర్ల బాధితులు అదేపనిగా అడగడం అక్కడ కనిపిస్తోంది. అప్పడే 48 ఏళ్ల తోంబీ, తన వీపు వెనకున్న గుడ్డ సంచిలో నుండి జారిపోతున్న 18 నెలల మనవరాలు అంజలిని పైకి సర్దుకుంటూ అటువైపుగా వచ్చింది. 'మే నెల మొదటివారంలో మేమంతా ఇక్కడికి వచ్చాం. మీరు మేం ఉంటున్న గ్రామాలకు వెళ్తున్నారంట కదా? అక్కడ వాతావరణం ఎలా ఉంది? మేం ఇక్కడకి వచ్చేశాక మా ఇళ్లను తగలబెట్టేశారని తెలిసింది. గ్రామాలకు గ్రామాలు తుడిచి పెట్టుకుపోయాయాని విన్నాం. అదంతా నిజమేనా? ఇల్లు లేకపోతే మేం ఎక్కడకు పోవాలి? మా పరిస్థితి ఏంటి?' అంటూ ఆమె ఓ రిపోర్టరును అదే పనిగా ప్రశ్నిస్తోంది. ఆమె మాటల్లో ఎంతో ఆందోళన.. భవిష్యత్తు గురించిన దిగులు స్పష్టంగా కనిపిస్తోంది.

మణిపూర్ లోయల్లో చురచుందపూర్, కంగ్పోకీ జిల్లాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా కాలిపోయిన ఇళ్లు, ధ్వంసమైన కట్టడాలే దర్శనమిస్తున్నాయి. ఆగస్టు నెలలో ఓ మీడియా బృందం ఆ దృశ్యాలను చిత్రీకరించేందుకు వెళ్లినప్పుడు అక్కడే పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న మెయితీ, కుకీ తెగల వాళ్లను కలిశారు. అక్కడ కొంతమంది మహిళలు తమ నివాసాలు ఎలా ఉన్నాయోనని దిగులుపడుతుంటే.. మరికొంతమందికి తమ ఇళ్లు కూలిపోయాయని, గ్రామంలో తమకంటూ ఏమీ మిగల్లేదని అర్థమైనట్లు విచార వదనాలతో కనిపించారు. ఇంఫాల్ పట్టణంలో కుకీలు నివసించే అర కిలోమీటరు పొడవునా కాలిపోయిన ఇళ్లే దర్శనమిస్తున్నాయి. ఆ దృశ్యాలను ఫొటోలు తీయకుండా, లోపలికి ఎవరినీ రానీయకుండా కొన్ని మెయితీ గుంపులు అక్కడ కాపలా కాస్తున్నాయి. 'ఇంఫాల్ పక్కనే ఉన్న ఫయేంగ్ గ్రామం మాది. మాకు అక్కడ ఓ ఇల్లు ఉంది. గోధుమ పండించుకుంటున్నాం. మూకలు మా గ్రామంలోకి చొరబడ్డాయని తెలిసి ఇల్లు వదిలి వచ్చేశాం. ఒంటి మీద ఉన్న దుస్తులే మాతో ఉన్నాయి. మరో జత బట్టలు కూడా తీసుకోలేకపోయాం. మేం వచ్చేశాక ఆ మూక ఇళ్లను తగలబెట్టేసిందని విన్నాం. ఇప్పుడు మేం ఏం చేయాలి? అంటూ కన్నీరుమున్నీరవుతూ చెబుతోంది పునరావాసంలో ఉంటున్న కుకీ తెగకు చెందిన లెయిమా.

చురచంద్‌పూర్‌లో ఏర్పాటు చేసిన కుకీ పునరావాసకేంద్రం

పునరావాసంలో వ్యత్యాసం

మణిపూర్ అల్లర్లలో రెండు తెగల వాళ్లూ బాధితులే.. అయితే ఎక్కువగా ప్రభావితమైందని మాత్రం కుకీలని కచ్చితంగా చెప్పొచ్చు. ఈ వ్యత్యాసం వారికి ఏర్పాటు చేసిన పునరావాసాల్లోనే స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ నిర్మించిన కార్డ్‌బోర్డు క్యాబిన్లతో కూడిన ఇళ్లల్లో ఒక్కొక్క మెయితీ కుటుంబం నివసిస్తోంది. రోజుకు రూ.80 భృతి వారికి ఇస్తున్నారు. వారికిష్టమైన వంట వండుకునే సౌకర్యం కూడా ఉంది. మరోపక్క కుకీల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఏ ఒక్కటీ ప్రభుత్వ నడపడం లేదు. చర్చిలు నిర్వహించే స్కూళ్లలో వాళ్లు తలదాచుకుంటున్నారు. టార్పలిన్ పట్టాలపై, మట్టి నేలపై పడుకుంటున్నారు. ఇక గ్రామాల్లో ఏర్పాటుచేసిన పునరావాసాల్లో అయితే తలుపులు, కిటికీలు లేని ఏక గదుల్లో పదుల కుకీ కుటుంబాలు నివసిస్తున్నాయి. బియ్యం, రోటీ, బంగాళదుంపలే వారికి అందుతున్నాయి. ఇన్ని రోజుల నుండి అవే వారి ఆహారం. ఏ రోజూ మెనూ మారలేదు. ధ్వంసమైన ఇళ్ల పునర్నిర్మాణంలో కూడా తేడా కనపడుతోంది. మెయితీ ఇళ్లను పునర్నిర్మిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కుకీలకు అటువంటి భరోసా ఏమీ లేదు.

ఇంకా అక్కడ ఏం కనిపిస్తోందంటే..

మూడు నెలలుగా నిర్జీవమైన ఇళ్లతో నిండిపోయిన ఆ గ్రామాల్లో ఇప్పుడు ఇంకో దృశ్యాలు కనిపిస్తున్నాయి. కూలిపోయిన ఇళ్లను దోచుకునేందుకు కొంతమంది దొంగచాటుగా వస్తున్నారు. విలువైన వస్తువుల కోసం వెతుకులాట ప్రారంభిస్తున్నారు. ఇటుకలు, ఇనుము, డబ్బు, నగలు, ధాన్యం మూటలు ... ఇలా ఒకటేమిటి చేతికి ఏది వస్తే అది పట్టుకెళ్తున్నారు.

ఇంటి బయట బోర్డులు కనిపిస్తున్నాయి

మణిపూర్ లోయలో, కొండల్లో నివసిస్తున్న నాగాలు, మెయితీలు, పంగళ్ల (మెయితీ ముస్లింలు) ఇళ్ల ముందు ఇప్పుడు కొత్తగా నేమ్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. జాతి ఘర్షణల నుండి తమను తాము రక్షించుకునేందుకు వారి దుకాణాల ముందు, ఇళ్లతో సహా ఏదేని వారి ఆస్తుల బయట వారు ఏ కమ్యూనిటీకి చెందినవారో తెలియజేసే పోస్టర్లు ప్రదర్శిస్తున్నారు.

కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం చెలరేగిన అల్లర్లకు ప్రాణాలు కోల్పోయి, గౌరవం పోయి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. బతుకుతెరువు కోసం పొరుగు రాష్ట్రాలకు తరలిపోయిన కుటుంబాలెన్నో.. బాధితులెవరైనా.. ఏ తెగవారైనా భద్రత కల్పించాల్సిన బాధ్యత పాలకులదే.. కానీ, గూడు చెదిరి, బతుకు లేక.. ఆదుకునే వారు కనిపించక అంధ:కారమైన ప్రజల పట్ల పక్షపాతం చూపిస్తున్నారు. ఆదుకునేవారు కనిపించక ఇప్పుడు ఆ వర్గం తల్లడిల్లుతోంది. ఆసరా లేక బతుకుపై భయంతో, ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని వారంతా బిక్కుబిక్కు మంటూ జీవిస్తున్నారు.

కుకీ పునరావాసంలో తలదాచుకుంటున్న ఓ మహిళ

గొంతు నొప్పి వేధిస్తుందా

వర్షాకాలంలో ప్రధానంగా వేధించే సమస్యలలో జలుబు, దగ్గు ముఖ్యమైనవి. వీటితో పాటు గొంతు నొప్పి కూడా చాలా మందిని వేధిస్తూ ఉంటుంది. వాతావరణం చల్లగా ఉండటమే గొంతు నొప్పికి కారణం. చాలా మందికి ఉదయం లేచే సరికి గొంతు పట్టేస్తూ ఉంటుంది. మరికొంతమందికి గొంతునొప్పి రోజులు తరబడి వేధిస్తూ ఉంటుంది. కొన్ని రకాల కషాయాలను తాగడం ద్వారా ఈ నొప్పిని తగ్గించుకోవచ్చు.

అల్లం కషాయం : దీనిని తయారు చేయడానికి ముందుగా వేడి నీటిలో అల్లం వేసి ఉడికించాలి. తరువాత ఆ నీటిని ఓ గుడ్డలో వేసి వడకట్టాలి. తరువాత ఆ నీటిలో కొంచెం తేనే వేసుకొని తాగాలి. అల్లంలో ఇన్ఫెక్షన్లను పోగొట్టే లక్షణాలు ఉంటాయి. అందుకే దీనిని తీసుకుంటే గొంతు నొప్పి తగ్గుతుంది. లేదా అల్లం టీ లాంటివి తాగినా మంచి ప్రయోజనం ఉంటుంది.

తులసి, మిరియాల కషాయం : కొన్ని తులసి ఆకులు, మిరియాలు కలిపి నీటిలో ఉడికించాలి. తరువాత వాటిని వడకట్టి ఆ నీటిని తాగాలి. ఇలా చేయడం వల్ల గొంతు నొప్పి త్వరగా తగ్గే అవకాశం ఉంది.

మిరియాలు, బాదం కషాయం : నల్ల మిరియాలను, బాదం పప్పులను కలిపి పొడి చేసుకోవాలి. దాన్లో కొంచెం నెయ్యి కలిపి తీసుకోవాలి. ఇలా చేస్తే గొంతు నొప్పి త్వరగా తగ్గుతుంది. నల్ల మిరియాల పొడిని నీటిలో వేసుకొని తాగినా తొందరగా గొంతు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

గోరు వెచ్చని నీరు : గొంతునొప్పి వచ్చినప్పుడు గోరు వెచ్చని నీటిని మాత్రమే తాగాలి. కూల్ డ్రింక్స్, చల్లని పానీయాలు, చల్లని నీటిని తాగడం ఆపేయాలి. వీలైనంత వరకు వేడిగా ఉండే పదార్థాలనే తీసుకోవాలి.

కోహ్లి, రాహుల్ శతకాలు

పాకిస్తాన్‌పై రికార్డు గెలుపు కుల్దీప్‌కు ఐదు వికెట్లు

కొలంబో: ఆసియాకప్ టోర్నీ సూపర్-4లో భారత్ జూలు విదిలించింది. ప్రేమదాస స్టేడియం లో పాకిస్తాన్‌తో జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో టీమిండియా ఏకంగా 228 పరుగుల తేడాతో రికార్డు గెలుపును నమోదు చేసింది. 24.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 147 పరుగులతో రిజర్వుడే అయిన సోమవారం మ్యాచ్‌ను కొనసాగించిన టీమిండియా 50 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 356పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. కెఎల్ రాహుల్(111పరుగులు; 106బంతుల్లో 12 ఫోర్లు, 2సిక్సర్లు), విరాట్ కోహ్లి(122 పరుగులు; 94బంతుల్లో 9ఫోర్లు, 3సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగా రు. ఛేదనలో పాకిస్తాన్ జట్టు 32 ఓవర్లలో 128పరుగులకే ఆలౌటైంది. 8 వికెట్ల నష్టానికి 128పరుగులు చేశాక చివరి ఇద్దరు బ్యాటర్ క్రీజ్‌లోకి రాలేదు. దీంతో అంపైర్లు భారత్ గెలిచినట్లు ప్రకటించారు. ఈ మ్యాచ్‌కు వర్షం పలుమార్లు అంతరాయం కలిగించింది. పాక్ జట్టులో ఫకర్(27), అఘా సల్మాన్(23), ఇఫ్తికార్ (23) టాప్ స్కోరర్స్. కుల్దీప్(5/25), బుమ్రా, శార్దూల్, హార్దిక్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. తొలుత విరాట్-రాహుల్ కలిసి 3వ వికెట్‌కు ఏకంగా 233 మరోవికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతూ 3వ వికెట్‌కు 233పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కోహ్లి 84 బంతుల్లో 6ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో, కెఎల్ రాహుల్ 100 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో సెంచరీలను పూర్తి చేసుకున్నారు.

ఆసియాకప్‌లో నేడు.. భారత్ × శ్రీలంక

సచిన్ రికార్డును బ్రేక్ చేసిన కింగ్ కోహ్లి...

టీమిండియా రన్ మిషన్ విరాట్ కోహ్లి వన్డేల్లో 13000 పరుగుల మైలురాయికి చేరి ఓ రికార్డును నమోదు చేశాడు. కోహ్లి 13వేల పరుగుల మార్క్‌ను 277ఇన్నింగ్స్‌లో చేయగా.. సచిన్ టెండూల్కర్ ఆ మార్క్‌ను 321 ఇన్నింగ్స్‌లో చేశాడు. దీంతో సచిన్ రికార్డును కోహ్లి బ్రేక్ చేశాడు. అలాగే విరాట్ కోహ్లి వన్డే కెరీర్‌లోనూ ఇది 47వ, అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్లలో కలిపి 77వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఈ ఏడాది 1000పరుగులు పూర్తి చేసుకోవడం విరాట్‌కు ఇది 12వ సారి.

యుఎస్ ఓపెన్ ఛాంప్ జకోవిచ్

ఫైనల్లో మెద్వదేవ్‌పై గెలుపు • మార్గరేట్ కోర్ట్ రికార్డు సమం

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను 2వ ర్యాంకర్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ చేజిక్కించుకున్నాడు. సోమవారం జరిగిన ఫైనల్లో జకోవిచ్ 6-3, 7-6(7-5), 6-3తేడాతో 3వ ర్యాంకర్, రష్యాకు చెందిన డానియెల్ మెద్వదేవ్‌ను ఓడించా డు. ఫైనల్ పోరు హోరాహోరీగా సాగుతుం దని భావించినా.. వరుస సెట్లలో నే మెద్వదేవ్‌ను చిత్తుచేశాడు. తొలి సెట్‌ను 6-3తో చేజిక్కించుకున్న జకో.. రెండో సెట్‌లో మెద్వదేవ్ నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. రెండోసెట్ 6-6తో సమంగా ఉన్న దశలో జకోవిచ్ టై బ్రేక్‌లో 7-5పాయింట్లతో ఆ సెట్‌నూ చేజిక్కించుకున్నాడు. నిర్ణయాత్మక మూడో సెట్‌లో రెండు బ్రేక్ పాయింట్లు సాధించి 6-3 తేడాతో ఆ సెట్‌నూ కైవసం చేసుకున్నాడు. ఈ మ్యాచ్ సుమారు మూడు గంటల 17 నిమిషాల పాటు సాగింది. 2021 యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో జకోవిచ్.. మెద్వదేవ్ చేతిలో ఓటమిపాలవ్వడగా.. ఈసారి జకోవిచ్.. మెద్వదేవ్‌ను బోల్తా కొట్టించాడు. తాజా గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో కలిపి జకోవిచ్ సాధించిన గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల సంఖ్య 24కు చేరింది. ఈ క్రమంలోనే 23 గ్రాండ్‌స్లామ్స్ టైటిళ్లతో పురుషుల విభాగంలో అగ్రస్థానంలో ఉన్న జకోవిచ్.. తాజాగా గ్రాండ్‌స్లామ్‌తో మహిళల విభాగంలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన మార్గరేట్ కోర్ట్(24 గ్రాండ్‌స్లామ్స్) రికార్డును సమం చేశాడు. జకోవిచ్‌కు మూడు మిలియన్ డాలర్ల (రూ.25 కోట్లు), మెద్వదేవ్‌కు ఒకటిన్నర మిలియన్ డాలర్లు(రూ.12.5కోట్లు) ప్రైజ్‌మనీ దక్కింది.

వన్డే ప్రపంచకప్ న్యూజిలాండ్ కెప్టెన్‌గా విలియమ్సన్

క్రైస్ట్‌చర్చ్: భారత్ వేదికగా అక్టోబర్‌లో జరిగే ఐసిసి వన్డే ప్రపంచకప్ న్యూజిలాండ్ కెప్టెన్‌గా సీనియర్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ ఎంపికయ్యాడు. న్యూజిలాండ్ క్రికెట్‌బోర్డు వన్డే ప్రపంచకప్‌కు ప్రకటించిన 15మందితో కూడిన జట్టును సోమవారం వెల్లడించింది. సెంట్రల్ కాంట్రాక్ట్ లేని జిమ్మీ నీషమ్, ట్రెంట్ బౌల్ట్ ఈ స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు. యంగ్ ఓపెనర్ ఫిన్ అలెన్‌పై నమ్మకం ఉంచిన సెలెక్టర్లు.. కైల్ జేమీసన్, ఆడం మిల్నేలను దూరం పెట్టింది. అలాగే స్పిన్ ఆల్‌రౌండర్ మైఖేల్ బ్రాస్‌వెల్ బోర్డు ప్రకటించిన 15మంది జట్టులో చోటు దక్కలేదు. మోకాలి గాయం నుంచి కోలుకున్న విలియమ్సన్ మరోసారి జట్టును నడిపించనున్నాడు. అతడితో పాటు టిమ్ సౌదీకి ఇది నాల్గో ప్రపంచకప్.

జట్టు: విలియమ్సన్(కెప్టెన్), చాప్మన్, కాన్వే, లాథమ్(వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), మిచెల్, నీషమ్, ఫిలిఫ్స్, రవీంద్ర, సాంట్నర్, సోధీ, యంగ్, బౌల్ట్, సౌథీ, ఫెర్గూసన్,హెన్రీ.

శాఫ్ అండర్-16 ఛాంపియన్ భారత్

ఫైనల్లో బంగ్లాదేశ్‌పై గెలుపు

థింపు(భూటాన్): శాఫ్ అండర్-16 ఛాంపియన్ షిప్-2023 టైటిల్‌ను భారత్ చేజిక్కించుకుంది. ఫైనల్లో భారత్ 2-0గోల్స్ తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 8వ ని.లో లైరెంజమ్, రెండో అర్ధభాగంలో లెవిస్ జాంగ్‌మిన్‌లున్ గోల్ చేసి విజయంలో కీలకపాత్ర పోషించారు. భారత రైడర్ లైరెంజమ్ బంగ్లా గోల్ కీపర్ మహ్మద్ నహిదుల్ ఇస్లామ్ కాళ్ల మధ్యనుంచి బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపి 1-0 ఆధిక్యతను సంపాదించాడు. బెస్ట్ గోల్‌కీపర్ అవార్డు సూరజ్‌సింగ్(భారత్), మోస్ట్ వ్యాల్యూబుల్ ప్లేయర్ అవార్డు(మల్దీవులు)కు దక్కాయి.

చిరంజీవి 157వ సినిమా పనులు ప్రారంభం

చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా యూవీ క్రియేషన్స్ వశిష్ట దర్శకత్వంలో ప్రకటించిన 157వ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. 'త్వరలో మీ అందరినీ సినిమాటిక్ అడ్వంచర్‌కు తీసుకెళ్లేందుకు మేము సిద్ధంగా ఉన్నాము' సినిమాకు రచన, దర్శకత్వం వహిస్తున్న వశిష్ట ట్వీట్‌చేశారు. చిరంజీవి, నిర్మాత, డిపిఒ చోటా కె నాయుడుతో ఉన్న డీవోపితో కలసివున్న ఫొటోని షేర్ చేశారు. ఈ మెగా మాస్ బియాండ్ యూనివర్స్ ప్రాజెక్ట్‌కు సంబధించిన ఇతర తారాగణం, టెక్నికల్ బృందం వివరాలను త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈ సినిమాకు నిర్మాతలు వంశీ, ప్రమోద్, విక్రమ్‌లు వ్యవహరించనున్నారు.

లోకేష్ కనగరాజ్ వర్సెస్ రజనీకాంత్

లోకేష్ కనగరాజ్ రజనీకాంత్‌తో సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం రజనీకాంత్ కెరియర్‌లో 171వ చిత్రంగా రానుంది. రజనీకాంత్‌తో సినిమా చేయడంపై లోకేష్ కనగరాజ్ తన ఆనందాన్ని ట్విట్టర్ వేదికగా షేర్ చేసుకున్నారు. తలైవాతో సినిమా చేయబోతున్నందుకు ఎంతో ఎగ్జయిట్ అవుతున్నట్లుగా ట్వీట్ చేశారు. ఈ సినిమాకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందించబోతున్నారు. లోకేష్ ప్రతి సినిమాకు మరో పార్ట్ ఉన్నట్లుగా.. రజనీతో చేసే ఈ సినిమా కూడా అందులో భాగమవుతుందా? అనేది తెలియాల్సి ఉంది.

పుష్ప-2 విడుదల ఎప్పుడంటే

పుష్ప-2 చిత్రం విడుదలతేదీ వచ్చేసింది. అల్లు అర్జున్ హీరోగా వచ్చిన 'పుష్ప' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లు మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు ట్వీట్ చేసింది. 'డేట్ మార్క్ చేసుకోండి.. 'పుష్ప- ది రూల్' వచ్చే ఏడాది ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతుంది. బాక్సాఫీస్‌ను బద్దలు కొట్టడానికి 'పుష్పరాజ్ మళ్లీ వస్తున్నాడు" అని ట్వీట్‌లో పేర్కొన్నారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అల్లు అర్జున్, రష్మిక మందన్నా నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఫవాద్ పాజిల్, సునీల్, అనసూయ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

10వ వర్ధంతి

నేటికి 10 సంవత్సరాలు అయ్యిందా!
అయినా
క్షణ క్షణం... నీ జ్ఞాపకాలే,
నీకదలికలే...
నిన్ను మరచిపోయింది
ఎప్పుడు?

మరణం : 12-09-2013
కామ్రేడ్ : కంచర్ల ప్రమీల

భర్త : అరుణ్ జీ

కుమార్తెలు	అల్లుళ్ళు
కోనేరు కృష్ణ భారతి	కోనేరు శ్రీనివాసరావు
గద్దె కృష్ణ జ్యోతి	గద్దె వెంకటకృష్ణ

బంధుమిత్రులు

మనుమడు :
గద్దె తేజేష్,
మనుమరాళ్ళు :
డా॥కోనేరు స్పందన, MBBS
శ్రీమతి ముక్కామల సాహితి

అరుణ్ జీ
ప్రజా నాట్య మండలి, కరాస, డోరు నెం. 58-12-17, విశాఖపట్నం - 530009
సెల్ : 9441234826, ఫోన్ నెం. 0891-2556672

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68